



గుంటూరు: ఎస్సీ హాస్టల్లో తలుపులు కూడా లేకుండా శిథిలమైన మరుగుదొడ్లు



గుంటూరు : ఎస్సీ హాస్టల్లో పనిచేయని ఫ్యాను, దుప్పట్లు లేకుండా పడుకున్న చిన్నారులు



మాచర్ల: దుర్గి బీసీ హాస్టల్ లో చాలీచాలని దుప్పట్లతో సరిపెట్టుకుంటున్న విద్యార్థులు

హాస్టల్లో.. అన్నీ కష్టాలే

తల్లిదండ్రులు, బంధువులు, అయినవారందరికీ దూరంగా ఉంటూ నాలుగక్షరాలు నేర్చుకుందామని సంక్షేమ వసతి గృహాలకు వచ్చిన చిన్నారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక వారు పడుతున్న అగచాట్లకు అంతే లేదు. నాలుగు ముక్కలు నేర్చుకుని ప్రయోజకులవుదామనుకున్న వారికి ఆ భాగ్యం ఎంతవరకూ దుక్కుతుందో ఏమో తెలియదుగానీ, వారు హాస్టళ్లలో నిత్యం పోరాడుతూనే ఉండాల్సి వస్తోంది. వసతి గృహాలకు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. వసతి గృహాల నిర్వహకులు అందినకాడికి అప్పులు చేసి విద్యార్థుల ఆకలి తీరుస్తున్న దుస్థితి. ఇది ఒక్క సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లోనే నెలకొంది. బీసీ సంక్షేమ వసతి గృహాలకు మాత్రం ఇటీవల బిల్లుల బకాయిలు చెల్లింపులు జరిగాయి. ఎస్సీ వసతి గృహాలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. వసతి గృహాలకు నిధులు విడుదల చేయకుండానే ఖచ్చితంగా మెనూ అమలు చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇస్తుండటం గమనార్హం. వసతి గృహాల నిర్వాహక అధికారులు తమ బంగారం కుదువ పెట్టి కూడా అప్పులు తెస్తున్న పరిస్థితి.. ఇదిలా ఉంటే ఫ్యానులు తిరగక, దోమతెరలు లేక పిల్లలు ప్రతి రోజూ దోమలతో యుద్ధం చేయాల్సి వస్తోంది. శీతాకాలం చలితో పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడో విద్యా సంవత్సరం ఆరంభంలో ఇవ్వాల్సిన దుప్పట్లు వారికి ఈరోజు వరకూ అందలేదు. ఇలా అష్టకష్టాలతో విద్యార్థుల హాస్టళ్ల జీవితాలు ఉమ్మడి జిల్లాలో నెలకొన్నాయి.

- భోజన బకాయిలు.. 7 నెలలు
- కాస్మోటిక్ ఛార్జీలకూ దిక్కులేదు
- నోట్ బుక్స్.. సామాగ్రి పంపిణీ లేదాయె
- నాలుగు నెలలైనా అందని దుప్పట్లు
- ఫ్యానులు తిరగక, దోమ తెరలు లేక అగచాట్లు
- చలికాలం వచ్చేస్తున్నా ఇదిగో.. అదిగో అంటున్న అధికారులు
- కనీస వసతులు లేక ఇబ్బందులు
- వెంటాడుతున్న మరుగుదొడ్ల సమస్య

ఆంధ్రజ్యోతి విజిట్

(ఆంధ్రజ్యోతి గుంటూరు బృందం)

ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత విద్యా సంవత్సరం జనవరి నుంచి బిల్లులు చెల్లించలేదు. ఆ ప్రభుత్వం వసతిగృహాల నిర్వహణను పూర్తిగా గాలికివదిలేసింది. జనవరి, ఫిబ్రవరి బిల్లులు రెండు రోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా నేటివరకు ఒక్క రూపాయి కూడా వసతి గృహాలకు నిధులు విడుదల చేయలేదు. ఏడు నెలలుగా వసతిగృహాల బిల్లులు విడుదల కాలేదు. రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోయాయి. కాస్మోటిక్ ఛార్జీలు సైతం విద్యార్థులకు అందలేదు. చివరకు నోటు పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్లు, ట్రంకు పెట్టె తదితర సామగ్రి ఈ విద్యా సంవత్సరంలో ఒక్కరికి కూడా పంపిణీ చేయలే దు. బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో నిర్వాహక అధికారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. విద్యా ర్థుల కడుపు మాడ్చలేక.. అప్పులు తీర్చలేక.. బిల్లులు రాక దిక్కుతోచని స్థితిలో హెచ్‌డబ్ల్యూవోలు కొట్టుమి ట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో నిర్దేశించిన భోజన పట్టికను అమలుచేయలేక నిర్వహణ అధికారులు చేతులేత్తేస్తున్నారు. భోజన బిల్లులు విడుదల చేయకపోవడంతో నిర్వాహకులు విద్యార్థుల ఆకలిని తీర్చలేకపోతున్నారు. కాస్మోటిక్ ఛార్జీ లు 9 నెలలుగా చెల్లించలేదు. కాస్మో టిక్ ఛార్జీలకూ దిక్కులేదు. ప్రభుత్వం మాత్రం నెల వారీ కాస్మోటిక్ ఛార్జీల నగదు ఇవ్వడం లేదు. దీంతో తలకు నూనె కొనాలన్నా, స్నానానికి సబ్బు కావాలన్నా ఇంటివైపు చూడక తప్పడంలేదు. విధిలేక ప్రతి నెలా తమ తల్లిదండ్రులను ఖర్చులకు డబ్బులు పంపమని అడగడం పరిపాటిగా మారింది. వసతిగృహాలల్లోని విద్యార్థులకు ప్రతినెలా కాస్మోటిక్ ఛార్జీల కింద 3నుంచి 6వ తరగతి బాలికలకు రూ.110, బాలురకు రూ.100 అందజేయాల్సి ఉంది. 7నుంచి 10వ తరగతి వరకు బాలికలకు రూ.160, బాలురకు రూ.125 చొప్పున తలనూనె, సబ్బులు ఇతర సామాగ్రి కొనుగోలుకు ఇ స్తుంటుంది. బాలురకు రూ.30చొప్పున హెయిర్ కటింగ్ ఛార్జీల కింద అదనంగా విడుదలచేస్తుంది. ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లించకపోతుండటంతో విద్యార్థులు ఇంటికెళ్లి తమ అవసరాల నిమిత్తం డబ్బు తెచ్చు కుంటున్నారు. ఇది తల్లిదండ్రులకు భారంగా మారుతోంది.

కనీసం దుప్పట్లు పంపిణీ లేదాయె

విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతిగృహాల్లో చేరే విద్యార్థులకు కొంత సామాగ్రిని ప్రభుత్వం పంపిణీ చేస్తుంది. వసతిగృహాలు తెరిచి రెండు నెలలు గడి చినా నేటివరకు విద్యార్థులకు ఎటువంటి సామాగ్రి అందజేయలేదని నిర్వహకులు తెలిపారు. ప్రతి విద్యార్థికి నోట్ పుస్తకాలు, దుప్పట్లు, ప్లేట్, గ్లాసు, ట్రంగ్ పెట్టె తదితర సామాగ్రిని పంపిణీ చేయాలి. ఇవేవి నేటి వరకు విద్యార్థులకు అందజేయలేదు. వీటిని కూడా పంపిణీ చేయలేదంటే వసతి గృహాల నిర్వహణపై పాలకుల చిత్త శుద్ధిని తెలియజేస్తోంది.

కనీస వసతులకు నిధులు లేవాయే

వసతి గృహాల నిర్వహణకు నిధులు విడుదల కావడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు సంబంధితులు వాపోతున్నారు. చివరకు బల్బు మాడిపోయినా దానిని మార్చాలన్నా వారి జేబులో నుంచి ఖర్చు చేయాల్సిందే. మరుగు దొడ్ల నిర్వహణ, తాగునీటి, అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావడంలేదు. కనీస వసతులకు హెచ్‌డబ్ల్యూవోలు సొంతంగా ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొందన్న విమర్శలున్నాయి. వైసీపీ పాలనలో వసతి గృహాలపై నిర్లక్ష్యపు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతి గృహాలకు మహార్దశ పడుతుందని అయా వర్గాల తల్లి దండ్రులు ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా వసతి గృహాల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తల్లి దండ్రుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- గుంటూరులోని లాడ్జి సెంటర్లోని బీసీ వసతి గృహం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. వర్షం పడిన సమయంలో ఈ హాస్టల్‌కు వెళ్లాలంటే బురదలోనే చాలా దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. చీకటి పడితే పరిస్థితి మరింత దారుణంగా వుంది. హాస్టల్ భవనం పరవాలేదనిపించినా, ఇక్కడ వుండే విద్యార్థులకు దుప్పట్లు ఇంకా రాలేదు. కిందటేడాది ఇచ్చిన దుప్పట్లనే వాడుకుంటున్నారు. కొత్తవారైతే ఇళ్ల దగ్గర నుంచి తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు దుప్పట్లు వచ్చినా అవి మాత్రం విద్యార్థులకు చేరలేదు. అధికారులను అడిగితే ఇదిగో.. అదిగో అంటూ సమాధానం చెబుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా వుంది.
- ఎస్సీ హాస్టల్లో పరిస్థితి అత్యంత భయానకంగా వుంది. ఇక్కడ కిటికీలకు మెస్ కూడా లేదు. తలుపులు కూడా సరిగ్గా లేవు. చిన్నారులకు నాలుగు నెలలైనా దుప్పట్లు రాలేదు. దీంతో వారంతా దుప్పట్లు లేకుండానే పడుకోవాల్సి వస్తోంది. ఫ్యానులు కూడా సరిగా పనిచేయకపోవడంతో పనిచేసే ఫ్యానుల కింద గుంపుగా నిద్రిస్తున్నారు. అయినప్పటికీ దోమల పీడ భరించలేక చిన్నారులు నరకం అనుభవిస్తున్నారు. ఇక్కడ కూడా మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా వుంది.
- ఏటి అగ్రహారం 13వలైనులో గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కళాశాల హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు ధ్వసం అయినా పట్టించుకునే వారే కరువయ్యారు. మరోవైపు కిటికిలకు మెస్ లేకపోవడంతో రాత్రిపూట దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. హాస్టల్‌లో కనీసం 25 మంది కూడా వసతి పొందటం లేదు. మంచినీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో గల ఎస్సీ బాలుర వసతిగృహం, విభిన్న ప్రతిభావంతుల హాస్టల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. కనీసం విద్యార్థులు నిద్రించేందుకు బెడ్లు కూడా లేకపోవడంతో నేల పైన పడుకుంటున్నారు. చాలీచాలని ఫ్యానులు, కప్పుకునేందుకు దుప్పట్లో కూడా లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలకు మెస్ డోర్ లు కూడా లేవు. దోమతెరలు లేవు.
- దుగ్గిరాలలోని ఎస్సీబాలుర వసతి గృహంలో ఉన్న 60మంది విద్యార్థులు సైతం వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సమీకృత వసతిగృహంగా ప్రారంభమైన భవనానికి గడచిన ఐదేళ్లలో కనీస మరమ్మతులు లేక పోవడంతో భవనం హాలు కొద్దిపాటి వర్షానికి కూడా పైకప్పు నుంచి నీరు పడుతుండటంతో అందరూ ఒకచోట కూర్చుని చదువుకునే వీలులేకుండా పోయింది. దుప్పట్లు ఇవ్వక పోవడంతో రాత్రివేళ నిద్రించేందుకు కూడా అవకాశం లేక పోయింది.
- తాడికొండలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయగా, ఏపీ గురుకుల పాఠశాలలో 404 మంది విద్యార్థులకు దుప్పట్లు, బెడ్‌షీట్స్, కండువాలు ఇంకా అందలేదు. అలాగే తాడికొండలోని బీసీ బాలికల వసతి గృహంలో 100 మంది విద్యార్థినులు ఉన్నారు. వారికి దుప్పట్లు ఇంతవరకు అందలేదు. ఫిరంగిపురం మండలంలో ఎస్సీ, బీసీ హస్టల్స్ ఉన్నాయి. ఎస్సీ హస్టల్‌లో సుమారు 40 మంది విద్యార్థులు, బీసీ హస్టల్స్‌లో సుమారు 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటి వరకు దుప్పట్లు, రగ్గులు విద్యార్థులకు అందలేదు. గుంటూరులోని బీసీ, ఎస్సీ హస్టల్స్ ప్రధాన కార్యాలయంకు దుప్పట్లు, రగ్గులు చేరాయని, రెండు రోజుల్లో హస్టల్ విద్యార్థులకు అందజేస్తామని హస్టల్ వార్డెన్‌లు పేర్కొన్నారు.
- తాడేపల్లి మండలం పెనుమాక బీసీ బాలుర హాస్టల్‌లో దోమలు ఎక్కువగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. కిటికీల మెష్‌కు బొక్కలు పడి కనిపిస్తోంది. ఈ ఏడాది ఇంకా విద్యార్థులకు నూతన దుప్పట్లు ఇవ్వలేదు. హాస్టల్‌లో ఆరు గదులు ఉండగా ఇరుకుపాటి సదరు చిన్న గదుల్లో విద్యార్థుల సామాన్లు బ్యాగులు, అదే గదిలో ఆరేసుకునే బట్టలు ఇరుకు వాతావరణాన్ని సూచిస్తోంది. సదరు చిన్న ఇరుకు గదిలోనే దాదాపు 17 మంది విద్యార్థులు నిద్రకు ఉపక్రమిస్తున్నారు.



గుంటూరు: ఎస్సీ హాస్టల్లో తలుపులు లేని గది, దుప్పట్లు అడ్డుపెట్టుకున్న చిన్నారులు



గుంటూరు: ఏటి అగ్రహారం గిరిజన హాస్టల్‌లో ధ్వంసమైన కిటికీల మెస్



గుంటూరు: ఏటి అగ్రహారంలో గిరిజన హాస్టల్‌లో పెచ్చులూడుతున్న భవనం లోపలి భాగం



తెనాలి: పట్టలు కప్పి నిరుపయోగంగా ఉన్న బాత్రూమ్‌లు



గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లో ఎస్సీ బాలుర వసతిగృహం, విభిన్న ప్రతిభావంతుల హాస్టల్లో పండుకునేందుకు బెడ్లు కూడా లేకపోవడంతో నేలపైనే నిద్రపోతున్న విద్యార్థులు



గుంటూరు: ఎస్సీ హాస్టల్లో మురుగునీటిలోంచి మరుగుదొడ్డికి వెళుతున్న చిన్నారులు



తెనాలి: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల హాస్టల్ గదిలో నేలపైనే విద్యార్థులు, వారి సామాన్లు

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

- ప్రకటన జారీ చేసిన కలెక్టర్ అరుణ్‌బాబు
- 274 నీటి సంఘాలకు నవంబరు 21న పోలింగ్
- 40 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తి
- కౌలు రైతులకూ ఓటు హక్కు
- పల్లెల్లో రైతు వర్గాల్లో ఎన్నికల సందడి
- పట్టు సాధించేందుకు ప్రధాన పార్టీల కసరత్తు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగు నీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు ఇందుకు సంబంధించిన ప్రకటనను సోమవారం విడుదల చేశారు. ఎన్నికల ప్రకటన విడుదలలో జల వనరుల శాఖ ఎస్ఈ, ఎన్నికల అధికారి పి.కృష్ణమోహన్, డీఈఈ నరేంద్ర పాల్గొన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో

(మిగతా 8వ పేజీలో...)



కంప చెట్లతో మూసుకు పోయిన గోవిందాపురం మైనర్ కాలువ



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

- దేశభద్రతలో కీలకపాత్ర
- శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి
- పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్
- పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళి

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంపాలెంలోని పోలీసుల స్థూపం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల స్థూపానికి కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు పలువురు అధికారులు, ప్రముఖులు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు పుష్పగుచ్చాలు ఉంచి,రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ భద్రత, అదే విధంగా అంతర్గత భద్రతలోనూ పోలీసులు నిత్యం సవాళ్లను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా కొన్ని అనివార్య సంఘటనల్లో పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దేశభద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీసులకు ప్రతి ఒక్కరూ ఘన నివాళి అర్పించాలన్నారు. రానున్న రోజుల్లో శాంతి భద్రతల పరిరక్షణ, దేశ భద్రత విషయంలో ఒక్క పోలీస్ కూడా అమరుడు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడు తూ 1959లో ఇండో టిబెటియన్ సరిహద్దుల్లో లడాక్ వద్ద చైనా సైన్యంతో కరణ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన పోరులో పదిమంది పోలీసులు ప్రాణ త్యాగం చేశారన్నారు. దీనిపై 1962లో జరిగిన జాతీయస్థాయి దేశ భద్రత సమావేశంలో పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకుగాను దేశవ్యాప్తంగా అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినంగా జరుపుకోవాలని నిర్ణయించారన్నారు. అప్పటినుంచి ప్రతి ఏటా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా పోలీసులు, సైనికులు, కేంద్ర బలగాలు వెరసి 30వేల మంది వరకు దేశంకోసం ప్రాణత్యాగం చేశారన్నారు. అదేవిధంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21మంది ప్రాణ త్యాగం చేయగా, విభజిత గుంటూరు జిల్లాలో ఆరుగురు ప్రాణత్యాగం చేసి అమరవీరులయ్యారన్నారు. అదేధంగా జిల్లాలో కోవిడ్ సమయంలో ప్రజలకు సేవలందిస్తూ ఏడుగురు పోలీసులు ప్రాణత్యాగం చేశారన్నారు. అలాగే ఈ ఏడాది విధి నిర్వహణలో 12మంది పోలీసులు జిల్లాలో ప్రాణత్యాగం చేసినట్లు ఎస్పీ తెలిపారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రాథమిక హక్కుల అమలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఘననీయమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవి రమణమూర్తి, కె సుప్రజ, హనుమంతు, డిఎస్పీలు అబ్దుల్ అజీజ్, జయరాం ప్రసాద్, రమేష్, సీతారామయ్య, మల్లికార్జునరావులతోపాటు పలువురు డిఎస్పీలు, సిఐలు, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు కుటుంబ అవసరాల నిమిత్తం కొంత పారితోషకాన్ని అందించారు. అమరవీరుల కుటుంబసభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వారికి హామీ ఇచ్చారు.



పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద గౌరవ వందనంతో నివాళులర్పిస్తున్న సాయుధ పోలీస్ సిబ్బంది

చంద్రబాబు ముందుచూపుతోనే భారీగా గ్రాంట్లు
- బీజేపీతో పొత్తుపై పెదవి విరుపునకు ఇదే సమాధానం
- రూ. 15 వేల కోట్లతో మహానగరంగా అమరావతి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గాదెవారిపాలెంలో టీడీపీ, జనసేన వర్గాల బాహాబాహీ

పనిమనిషిగా చేరి... రూ.37లక్షల సొత్తు చోరీ
- ఓ వైద్యురాలి ఇంట్లో కిలాడీ లేడి బాగోతం
- దశల వారీగా బంగారు నగలు, నగదు అపహరణ

6

చంద్రబాబు ముందుచూపుతోనే భారీగా గ్రాంట్లు

- బీజేపీతో పొత్తుపై పెదవి విరుపునకు ఇదే సమాధానం
- రూ. 15 వేల కోట్లతో మహానగరంగా అమరావతి
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


ప్రత్తిపాడులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 'బీజేపీతో పొత్తు పెట్టుకోవడంలోనే చంద్రబాబు ముందుచూపు, దార్శనికత కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో బీజేపీతో పొత్తుపై చాలా మంది పెదవి విరిచారు. కానీ అధినేత చంద్రబాబు పొత్తుకే మొగ్గు చూపారు. ఆ ముందు చూపుతోనే అతి తక్కువ సమయంలో, అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగాం. అమరావతి నిర్మాణం కోసం ఇస్తున్న రూ.15వేల కోట్లతో అక్కడ ఒక మహానగరం ఆవిష్కృతమవబోతోంది. అమరావతికి నాడు ప్రాణం పోసిన చంద్రబాబు, ఇప్పుడు ఆ అమరావతిని మహా నగరంగా రూపొందించబోతున్నారు. అదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనత' అంటూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సీఎం చంద్రబాబు దార్శనికతను కొనియాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గ కేంద్రంలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు సోమవారం వెళ్లిన ఆయనకు ఘన స్వాగతం లభించింది. నాలుగు కిలోమీటర్ల మేర భారీ ర్యాలీతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలో అద్భుత రీతిలో గ్రాంట్లు రాబట్టగలిగామన్నారు. కొందరు దాన్ని అప్పు అంటున్నారని, ఎవరైనా చదువుకున్న వాళ్లు ఉంటే చూడండి, ఇది అప్పో, గ్రాంటో తెలుస్తుంది అని ఆయన స్పష్టత ఇచ్చారు. రూ.15 వేల కోట్ల నిధులతో ఒక మహానగరం ఇక్కడ రాబోతుందన్నారు. రూ.25 వేల కోట్లకు పైగా నిధులతో రైల్వే లైన్లను కేంద్ర ప్రభుత్వం ఆధునికీకరణ చేస్తుందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేసే కృషి రాబోయే తరాలకు అద్భుతమైన భవిష్యత్తును అందించబోతోందన్నారు. సీఎం చంద్రబాబు నాడు ఒక విజన్‌తో ఆలోచన చేశారంటే, అది ప్రజాభివృద్ధి కోసమే తప్ప మరేమీ కాదని ఎన్నికల ముందే చెప్పామని గుర్తు చేశారు. వినుకొండ మీదుగా నాలుగు లైన్ల జాతీయ రహదారిని వినుకొండ, తాడికొండ మీదుగా అమరావతిలో కలపబోతున్నామన్నారు. ఐదేళ్లుగా ఆగిపోయిన వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిరంతరం కృషి చేసి ప్రత్తిపాడుకు తిరిగి తీసుకువస్తున్నామన్నారు. 30 ఏళ్లుగా ఎవరి వల్లా కాని గుంటూరు శంకర్ విలాస్ వంతెనను సాధించామన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉండి జగన్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కేవలం నాలుగు నెలల్లోని చంద్రబాబు, లోకేశ్ నేతృత్వంలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి కనిపించకుండా చేశామన్నారు. గుంటూరు ఛానల్, గుంటూరు డ్రెయిన్, నల్లమడ డ్రెయిన్ సమస్యలకు కూడా త్వరలోనే పరిష్కారం అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాబోయే 40 ఏళ్లకు సరిపడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ విచారణకు చొక్కా లేకుండా వచ్చిన వ్యక్తి

- హైకోర్టు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

తుళ్లూరు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) ఒంటిపై చొక్కాలేకుండా ఓ వ్యక్తి ఆన్‌లైన్ విచారణలోకి రావడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ నెల 15న హైకోర్టులో కేసుల విచారణ జరుగుతుండగా కోర్టు నంబర్. 17లో కిట్టు అనే ఓ వ్యక్తి లాగిన్ అయ్యాడు. ఒంటిపై చొక్కా లేకుండా మంచంపై పడుకొని మాట్లాడుతూ కేసు విచారణకు ఆటంకం కలిగించాడని తుళ్లూరు ఎస్సై అంకమ్మరావు తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 267, 292. ఐటీ చట్టం సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి


చిల్లరగా నాణేల్ని చేస్తున్న బ్యాంకు అధికారులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, అవి రోజు వారి లావాదేవీలకు వినియోగించుకోవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ ఎస్.కె. కిరణ్ రెడ్డి తెలిపారు. సోమవారం లక్ష్మీపురం బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామందిలో పది రూపాయల నాణెం చెల్లదన్న అపోహ ఉందనీ, దానిని తొలగించేందుకు ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం రూ.60 వేలకుగానూ చిల్లరగా రూ.10 నాణేలను వినియోగదారులకు అందజేశారు. బ్యాంకు సిబ్బంది కె.వెంకటరమణరావు, ప్రసన్నా, శ్రీనివాసరావు, అశ్వత్ నారాయణ, ఖాతాదారులు సంజీవరెడ్డి, వి.కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ అమర వీరులకు నివాళి

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో అధికారులు ఘనంగా నిర్వహించారు. అమర వీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. విజయవాడ జోన్ ఎస్పీఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకర్రావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది చేసే త్యాగాలు మరువలేనివని అన్నారు.

పనిమనిషిగా చేరి... రూ.37 లక్షల సొత్తు చోరీ

- ఓ వైద్యురాలి ఇంట్లో కిలాడీ లేడి భాగోతం
- దశల వారీగా బంగారు నగలు, నగదు అపహరణ


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ వైద్యురాలి ఇంట్లో పనిమనిషిగా చేరి.. నమ్మకస్తురాలిగా నటించి అదను చూచి అందిన కాడికి దోచుకున్న కిలాడీ లేడీ భాగోతాన్ని మంగళగిరి రూరల్ పోలీసులు బట్టబయలు చేశారు. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ వివరాలను వెల్లడించారు. చెంగపు వెంకట రమణ అనే మహిళ మంగళగిరి బైపాస్ రోడ్డులోని మిడ్‌వ్యాలీ సిటీ సముదాయంలో ఓ వైద్యురాలి వద్ద నాలుగు నెలల క్రితం పనిమనిషిగా చేరింది. అత్యంత నమ్మకస్తురాలిగా నటిస్తూ దశల వారీగా వైద్యురాలి నివాసంలో చోరీలకు పాల్పడింది. తన సమీప బంధువు అయిన వేముల వెంకన్న సహకారంతో బంగారు నగలు, నగదు, ఖరీదైన సెల్‌ఫోన్లు, మోటారు బైకును అపహరించింది. అయితే, ఇటీవల డైమండ్ నల్లపూసల గొలుసు కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన వైద్యురాలు ఈ నెల 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మంగళగిరి రూరల్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, క్లూస్ టీం నివేదికల ఆధారంగా పనిమనిషి వెంకట రమణ ఈ చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. ఆత్మకూరు పరిధిలోని సీకే కన్వెన్షన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం నిందితులైన వెంకట రమణ, వెంకన్నలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు 300 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, రూ.11 లక్షల 9 వేల నగదు, రూ.లక్షన్నర విలువ చేసే యమహా ఆర్-15 బైకు, రూ.లక్ష విలువ చేసే శాంసంగ్ మొబైల్, రూ.90 వేల విలువ చేసే ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం దాదాపు రూ.37 లక్షలు వుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

కరవు రహిత రాష్ట్రంగా మార్చాలని కోరుకున్నా


చిలువూరులో పూజలు నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

దుగ్గిరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రానున్న ఐదేళ్లలో కరవురహిత రాష్ట్రంగా మార్చాలని గంగానమ్మదేవతను కోరుకున్నానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండల గ్రామం చిలువూరులో మూడ్రోజులుగా జరుగుతున్న గంగానమ్మ దేవత దేవస్థానం 12వ వార్షిక ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మంత్రి నిమ్మల మంగళవారం పాల్గొన్నారు. జగదీష్‌బాబు, రమేష్‌బాబు సోదరులు, అర్చకులు అంజనీకుమార్‌తో కలిసి మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ, బయోఫర్ సీఈఓ డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు ఆహ్వానం మేరకు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో యువ నాయకుడు నారా లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతగా జలవనరులశాఖ నుంచి అన్నివిధాల తొలిప్రాధాన్యత ఇచ్చి, ప్రజల రుణం తీర్చుకునేలా పనిచేస్తానన్నారు. డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు సోదరుడు గంగాశ్రీ డాక్టర్ రమేష్‌బాబు మంత్రి నిమ్మలను దుశ్శాలువాతో సత్కరించారు. రంగిశెట్టి జగదీష్‌బాబు, సుభాషిణి దంపతులు అమ్మవారికి అలంకరించేందుకుగానూ 108 చీరెలను సమర్పించారు. తెనాలికి చెందిన చిన్నారి కంతేటి గగనశ్రీ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులను, అమ్మవారి భక్తిపాటలకు కూచిపూడి నృత్యాభినయం చేసి ఆకట్టుకుంది. ఉత్సవాల అనంతరం వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, తెదేపా మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తోటకూర సీతారామయ్య, మండల జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, సాదిక్, బిట్టూ, కల్కి, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, యడ్ల సాయికృష్ణ, కేసంనేని వాసుబాబు, విశ్రాంత ఐఆర్ఎస్ ఉద్యోగి రంగిశెట్టి మంగబాబు, సింగులూరి వీరన్న, జ్యోతి, గద్దె శ్రీనివాస్, మండవ మౌళయ్య, ఆలపాటి శ్రీనివాసరావు, జలాలుద్దీన్, దేవభక్తుని రంగప్రసాద్ పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ పార్కు ప్రహరీ నిర్మాణం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఉద్యానవనంలో కూల్చి వేసిన ప్రహరీని నిర్మించారు. గోడను కూల్చి వేసిన టీడీపీ నాయకుడే తిరిగి నిర్మించాడు. పార్కులో ప్రహరీతో పాటు కళావేదిక కూల్చివేతపై 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కూల్చివేతలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒకటో పట్టణం పోలీసు స్టేషన్‌లో కమిషనర్ జస్వంత్ ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న సదరు వ్యక్తి సోమవారం ప్రహరీ నిర్మించారు. అయితే కూల్చివేసిన కళావేదికను కూడా సదరు వ్యక్తే నిర్మించాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తుళ్లూరు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి) వెంకటపాలెం వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డుపై ప్రమాదం సోమవారం సంభవించింది. ఈ ఘటనలో విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన పలగాని రాము(42)మృతి చెందాడు. మృతి చెందిన రాము సెంట్రింగ్ పనులు చేస్తూ ఉంటాడు. రాయపూడి గ్రామంలో పనులు ముగించుకొని తిరిగి వెళ్తుండగా, మారుతి షిఫ్ట్ ఏపీ 39 డబ్ల్యూ 9832 కారు వేగంగా వచ్చి రాము బైకును ఢీకొట్టింది. అతను అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లాడున్నాడు. తుళ్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అండర్ - 14 ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ - 14 ఫుట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు బాలుర విభాగం నుంచి 170, బాలికల విభాగం నుంచి 90 మంది క్రీడాకారులు హాజరైనట్టు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగభైరు సురేష్ కుమార్ తెలిపారు. జట్లను ఎంపిక చేశామని, ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఆయన తెలియ జేశారు. జిల్లా బాలుర జట్టుకు సాయి చరణ్, వై.గోపీచంద్, కె.చిరంజీవి, పి.చరణ్, వై.విజయ రాఘవరెడ్డి, జాన్ అఫ్రాన్, ఎం.మనోహర్, సీహెచ్ హర్షవర్ధన్, గౌరీ శంకర్, భాను, సంజయ్, ఎం. హనీష్, ఎం. సంజయ్, వి.నిఖిల్, తేజ సాయి, షేక్ మహమ్మద్ సైఫుల్లా, స్టాండ్ బైలుగా క్రాంతి వర్ధన్, అఫ్రాన్, హరినాథ్ ఎంపికయ్యారు. జిల్లా బాలికల జట్టుకు లక్ష్మీప్రసన్న, ఆర్. చైత్రశ్రీ, జి.పుష్పలత, పి.అక్షయ, స్వప్న, దివ్యశ్రీ, శ్రీవల్లి, అలేఖ్య, సీహెచ్ అభీర, జి.చిన్మయి, టి. త్రివేణి, పి.ప్రవల్లిక, ఎస్. రుచిత, ఎం జాహ్నవి, జి.అను, షేక్ సమీర, శ్రీలక్ష్మి, స్టాండ్ బైలుగా త్రివేణి, మంజుల, వై శిరీషాలు ఎంపికయ్యారు. ఎంపికల ప్రక్రియలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సీహెచ్ వినయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, అనీల్ దత్త నాయక్, కాకుమాను సునీత, జాలా శిరీష, రియాజ్, షేక్ పెద కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

గాదెవారిపాలెంలో టీడీపీ, జనసేన వర్గాల బాహాబాహీ



ఘర్షణలో గాయపడిన వారు

క్రోసూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలం గాదెవారిపాలెంలో మురుగు కాలువలకు పూడికతీసే విషయంలో ఘర్షణ చెలరేగి టీడీపీ, జనసేన వర్గాల వారు బాహాబాహీకి దిగారు. ఈ సంఘటనలో రెండు వర్గాలకు చెందిన ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే గాదెవారిపాలెంలో మురుగు కాలువలను శుభ్ర పరిచే కాంట్రాక్ట్‌ను జనసేన వారికి అప్పగించారు. ఈ క్రమంలో టీడీపీ వారు తాము కూడా పనులు నిర్వహిస్తామని రంగంలోకి దిగటంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాల వారు కర్రలు, పెట్రోల్ సీసాలు, రాడ్లతో ఘర్షనకు దిగారు. రెండు వర్గాలకు చెందిన గాదె సూరయ్య, అంకిపల్లి వేణుగోపాల్, అంకిపల్లి విశ్వేశ్వరరావు, చిమటా వెంకటేశ్వర్లు, చిమటా శ్రీకాంత్, యాదల గంగా పాల్, పిడుగు నాగేశ్వరరావు, కృష్ణవేణి గాయపడ్డారు. టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గాదె సూరయ్యకు తల భాగంలో ఎనిమిది కుట్లు, అంకిపల్లి వేణుగోపాల్‌కు కంటి భాగంలో 15 కుట్లు, చిమటా వెంకటేశ్వర్లుకు ఆరుకుట్లు పడ్డాయి. కృష్ణవేణి అనే మహిళకు తలకు బలమైన గాయమైంది. విషయం తెలిసిన వెంటనే సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, పెదకూరపాడు సీఐ సురేష్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్రబాబు హుటాహుటీన పోలీసు బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. టీడీపీకి చెందిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయటంతో పాటు తమకు చెందిన ఎరువుల దిబ్బలను తొలగించారని, కేవలం జనసేన వారి ప్రాంతాల్లో మాత్రమే మురుగు కాలువల పనులు నిర్వహిస్తున్నారని, ఇదేమని అడిగినందుకు తమ పై దాడులు చేసి కొట్టారని టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గాదె సూరయ్య అన్నారు. గ్రామ సభలు, పల్లె పండుగ ద్వారా గుర్తించిన పనులను గ్రామంలో జనసేనకు చెందిన కొంతమంది నిర్వహించటానికి పూనుకున్నారని, వారిలో కొంతమంది టీడీపీ వారు కూడా ఉన్నారని నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రామకృష్ణ అన్నారు.

టీడీపీ వారిపై దాడి

ముప్పాళ్ల అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తొండపిలో ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం బోరుపోతు నాగేశ్వరరావు పశువుల షెడ్డును నిర్మించుకునేందుకు రోడ్డుపై ఇసుక, మట్టి వేశాడు. దానిని ఇంటిలోకి మోస్తుండగా, ఎదురుగా ఉండే చింతిరాల అశోక్, సుధీర్‌లు నాగేశ్వరరావుతో ఒక్కడివే చేస్తున్నావు ఎన్నిరోజులు చేస్తావు అంటూ పాత కక్షలను మనసులో పెట్టుకుని ఆదివారం సాయంత్రం గొడవ పెట్టుకున్నారు. తిరిగి మద్యం తాగి సుధీర్, అశోక్‌లతో పాటు మరికొంతమంది కలిసి రాత్రివేళ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులపై కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడి చేశారు. దాడిలో నాగేశ్వరరావు సోదరులు యోద, భిక్షాలుకు గాయాలైయ్యాయి. సత్తెనపల్లిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

కలసికట్టుగా ఎదుర్కొందాం!

- యాంటీ బయోటిక్ విచ్చలవిడి వాడకం వద్దు
- నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు
- డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఏడీ లక్ష్మణ్ వెల్లడి

ఫటా ఫట్



గుంటూరు మెడికల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెనుసవాల్‌గా మారుతున్న ఔషధ నిరోధకత సమస్యను (యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్) ఔషధ వ్యాపారులతోపాటు పౌర సమాజం కలసికట్టుగా ఎదుర్కోవాలని ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. నగరంపాలెంలోని ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఔషధ నిరోధకత సమస్యను ఎదుర్కొనేందుకు శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. అవసరం ఉన్నా, లేకున్నా విచ్చలవిడిగా యాంటీ బయోటిక్ మందులను వాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. దీనివల్ల బ్యాక్టీరియాలు ఆ మందును తట్టుకునే శక్తిని సంతరించుకుంటాయని, ఫలితంగా మందులు తమ ప్రభావం కోల్పోతాయని తెలిపారు. దీని కారణంగా చిన్న జబ్బులు కూడా దీర్ఘకాలం వేధిస్తాయన్నారు. ప్రజలు కూడా యాంటీ బయోటిక్ మందులను సొంత నిర్ణయంతో వాడవద్దని ఆయన కోరారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీ బయోటిక్ మందులు విక్రయించవద్దని రిటైల్ మందుల దుకాణదారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఏడీ లక్ష్మణ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ మందుల దుకాణాలకు అవసరం లేకున్నా యాంటీ బయోటిక్ మందులు భారీగా డంప్ చేయడం తగ్గించుకోవాలని టోకు ఔషధ వ్యాపారులను ఆదేశించినట్లు చెప్పారు.

వ్యాపారుల్లో పెరుగుతున్న అవగాహన

కొంతకాలంగా తమ శాఖ తీసుకుంటున్న చర్యల ఫలితంగా రిటైల్ ఔషధ వ్యాపార వర్గాల్లో యాంటీ బయోటిక్ మందుల విక్రయాలపై నియంత్రణ జరుగుతోందని అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ తెలిపారు. గతంలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకున్నా యాంటీ బయోటిక్ మందులు విక్రయించిన పలు దుకాణాల లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో గుంటూరులోని పది రిటైల్ మందుల దుకాణాలపై తనిఖీ చేయగా, అన్ని చోట్ల చీటీలు లేకుండా యాంటీ బయోటిక్‌లు విక్రయించలేదని చెప్పారు. ఔషధ నియంత్రణ శాఖ చేపట్టిన చర్యలతో సెఫ్ట్రియాక్సోన్ ఇంజెక్షన్లు, సెఫిక్జిమ్ ట్యాబ్లెట్ల విక్రయాలు పూర్తి నియంత్రణలోకి వచ్చినట్లు చెప్పారు. వీటి విచ్చలవిడి అమ్మకాలను పూర్తిగా తగ్గించినట్లు వెల్లడించారు. షెడ్యూల్ హెచ్1 కేటగిరిలో విక్రయించే మందులకు సంబంధించి ఔషధ దుకాణదారులు తప్పనిసరిగా ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, లేకుంటే శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధిలో పోటీ పడుతున్న తెలుగు రాష్ట్రాలు

- తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


యలమంచిలి శివాజీని సత్కరిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తెలుగు రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు, బృందావన్‌గార్డెన్స్‌లోని మాజీ ఎంపీ యలమంచిలి శివాజీని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలు ఉన్నాయని అన్నారు. దీంతో ఉమ్మడి ప్రణాళికలను రూపొందించి మెరుగైన ఫలితాలు సాధిస్తామని తెలిపారు. పోలవరం నిర్మాణ సందర్భంగా ఏపీలో విలీనమైన ఏడు మండలాలు తిరిగి అడగడం లేదని, కేవలం ఏడు గ్రామాలనే అడుగుతున్నామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తిగా ఏపీ భూభాగంలో ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు తెలంగాణ ఎటువంటి అభ్యంతరాలు చెప్పలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపు వల్ల తెలంగాణకు నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరామని తెలిపారు. బ్యాక్ వాటర్ వల్ల వరద వచ్చినప్పుడు భారీగా ముంపు వస్తుంది అన్నారు. భద్రాచలం పట్టణం ఎగువన ఉన్న గ్రామాలను మాత్రమే తెలంగాణలో కలపాలని కోరుతున్నామన్నారు. టీటీడీలో వాటా అడగలేదని సిఫార్సులు లేఖలు ఇస్తే అనుమతి ఇచ్చారని, కానీ వైసీపీ ప్రభుత్వం టీటీడీపై నిబంధనలు పెట్టిందని గుర్తుచేశారు. తెలంగాణలో పామాయిల్ సాగు విపరీతంగా ఉందని, అమ్మకాల విషయంలో కూడా ముందంజలో ఉందన్నారు. ఏపీలో కూడా ఉత్తరాంధ్రాలో ఈ సాగును చేస్తున్నారని వివరించారు.

అధిక బరువుతో వాహనాలను తిప్పకుండా సహకరించాలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మేడికొండూరు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి అధిక బరువుతో టిప్పర్లను రహదారులపై తిప్పవద్దని రవాణా శాఖ ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి (డీటీసీ) సూచించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'టిప్పర్లు రోడ్డు ఎక్కాలంటే ముడుపులు చెల్లించాల్సిందే' అనే కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రకటన విడుదల చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన వాహన బరువుకు మించి అధికలోడుతో వాహనములు ప్రయాణించడాన్ని నిషేధించామని, అనుమతించిన బరువుకు ఐదుశాతం వరకు మార్జిన్ ఇస్తున్నట్లు తెలిపారు. అంతకుమించిన బరువుతో వాహనములు రహదారులలో ప్రయాణించినట్లయితే మోటారు వాహన చట్టం ప్రకారం రూ.20 వేలతో పాటు అదనంగా ప్రతి టన్నుకు రూ. 2వేల వంతున అపరాధ రుసుము విధిస్తామని పేర్కొన్నారు. గత రెండు నెలల్లో అధిక బరువుతో తిరుగుతున్న వాహనాలను గుర్తించి వారిపై 23 కేసులను నమోదు చేయటంతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. రహదారి భద్రత దృష్టిలో ఉంచుకొని అధిక బరువుతో తిరుగుతున్న వాహనాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున టిప్పర్ల యజమానులు ఈ విషయాన్ని గుర్తించి అధిక బరువుతో వాహనాలను వినియోగించకుండా ప్రభుత్వానికి, రవాణా శాఖ వారికి సహకరించాలని కోరారు. త్వరలో లారీ ఓనర్స్ అసోసియేషన్ వారితో సమావేశం నిర్వహించి అధిక బరువుతో వాహనాలను తిరగకుండా అవగాహన కల్పిస్తామని తెలియజేశారు.

తేమ శాతం ఎక్కువగా ఉంటే పత్తి కొనలేం

- సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి

గుంటూరు సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయలేమని జనరల్ మేనేజర్ పి అమర్నాథ్ రెడ్డి అన్నారు. గుంటూరులోని సీసీఐ ప్రధాన కార్యాలయంలో ఆయన సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సీసీఐ కేంద్రాలు తెరిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే 8 నుంచి 12 శాతం మేరకు మాత్రమే తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలన్న నిబంధనలు ఉన్నాయని అన్నారు. కర్నూలు జిల్లా ఆదోనిలో కూడా పత్తిలో ప్రస్తుతం 13 నుంచి 14 శాతం తేమ ఉన్నట్లుగా తేలిందని అన్నారు. ఏకధాటిగా వర్షాలు కురవడం వల్ల పత్తిలో తేమ ఎక్కువగా ఉంటుందని అన్నారు. పత్తిలో మైక్రో నేయర్ 5 శాతం వరకు ఉన్నా ధర తగ్గింపుతో కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. సెంటర్ ఇన్‌చార్జిలు ప్రతిరోజు పత్తిలో ఉన్న తేమను యంత్రాల ద్వారా కొలుస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 33 సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఉందని అన్నారు.ఆయా కేంద్రాలకు సంబంధించి 90 మిల్లుల కి పైగా టెండర్లు దాఖలు చేశాయని అన్నారు. అయితే 31 కేంద్రాలకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే ఖరారు చేశామని చెప్పారు. మిగిలిన రెండు సెంటర్ల వివరాలు కూడా కేంద్రానికి పంపామన్నారు. గుంటూరు జిల్లాలో 5, పల్నాడులో 7, బాపట్లలో 2, ఎన్టీఆర్ జిల్లాలో 6, ఏలూరులో 1, కాకినాడలో 1, పార్వతీపురంలో 1, కర్నూలులో 4, నంద్యాలలో 1, అనంతపురంలో 2, కడపలో 1 చొప్పున సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అమర్నాథ్ రెడ్డి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

రుక్మిణీ కళ్యాణంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళ్యాణ వేదికపై సోమవారం రుక్మిణీ కళ్యాణంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం జరిగింది. శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలలో భాగంగా మల్లాది కైలాసనాథ్ ప్రవచనం చేశారు.



చంద్రశేఖర్ ఆజాద్‌కు స్వాగతం పలుకుతున్న, శ్రీనివాసరావు, మాధవి

కన్యకా పరమేశ్వరి ఆలయంలో అక్రమాలపై ఆర్‌జేసీ విచారణ

● రూ.20 లక్షలు చెల్లించాలని ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన అక్రమాలపై తిరుపతి దేవాదాయ శాఖ ఆర్‌జేసీ ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం విచారణ జరిపారు. తొలత స్థానిక నాజ్ సెంటర్‌లోని ఎండోమెంట్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడ డీసీ, ఏసీ, ఇంజనీరింగ్ ఆఫీసులను క్షుణ్ణంగా పరిశీలించిన చేపట్టాల్సిన మార్పులను సూచించారు. అనంతరం కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయాన్ని దర్శించి అక్కడ విచారణ జరిపారు. గతంలో చైర్మన్ గా పని చేసిన చిన్ని హయాంలో రూ. 20 లక్షలు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలిందని, తక్షణమే అతని వద్ద ఆ డబ్బులు వసూలు చేసి బ్యాంకులో లాంగ్ టర్మ్ డిపాజిట్ చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక ఆర్ అగ్ర హారంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన, పాత భవనాలను తొలగించాలని ఆదేశించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆర్‌జేసీ తనిఖీలు చేపట్టారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు


గుంటూరు(విద్య),అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 21: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్దేశించిన దరఖాస్తు గడువు ఈ నెల 25వరకు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి మధుసూధనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణకు ఆసక్తి ఉన్న ఎస్సీఎస్టీ యువత https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా నిర్దేశించిన ధృవీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోచింగ్ ఇచ్చే సంస్థలు తమ వివరాలు https://tender.epeprocurement.gov.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.



బ్రెయిన్ డెడ్ యువతిని పరిశీలిస్తున్న కనపర్తి, కొమ్మినేని

బ్రెయిన్ డెడ్ బాధితురాలికి పరామర్శ

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి దాడిలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన తెనాలి యువతి మధిర సహనాను, ఆమె కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. పుట్టినరోజు వేడుక పేరుతో రౌడీ షీటర్ యువతిని కారులో తీసుకెళ్లి బలంగా గాయపరచడంతో బ్రెయిన్ డెడ్ అయిందని, బాధితురాలిని జీజీహెచ్‌లో చేర్చగా ఆమెను బతికించడానికి డాక్టర్లు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనికి కారణమైన నిందితుడు నవీన్‌ను పోలీసులు వెంటనే అరెస్టు చేసి, విచారణ జరుపుతున్నారని తెలిపారు.



మోజేస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

డాక్టర్ మోజేస్‌కు అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారం

గుంటూరు(విద్య),అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజేస్‌ను డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ కళాశాలలో ఆది వారం ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే ఎండీ నసీర్‌లు ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి: జేసీ భార్గవ్‌తేజ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 190 అర్జీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు జే సీ భార్గవ్ తేజ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మంది రంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 190 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారితో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు ఫిర్యాదులను పరిష్కరించి బీఎండ్ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎమ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి, ఎస్ఈఆర్ డబ్ల్యుఎస్ జి.బ్రహ్మయ్య సీపీవో శేషశ్రీ, డీఈవో శైలజ, ఎల్‌డీఎమ్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పెండింగ్ జీతాలను విడుదల చేయండి

వలంటీర్లకు గత మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య అర్జీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు పదివేల మంది వలంటీర్లు పనిచేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అయినా ఇంతవరకు జీతాలు అందలేదని తెలిపారు. వలంటీర్లు చేసిన సేవలను గురుతుపెట్టుకుని వారి సేవలను కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ 10వేల జీతంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు కోలా రాజేష్, వెంకట్ నాగరాజ్, రమేష్, తిరుపతమ్మ, బిందు, సతీష్‌దాసు తదితరులు ఉన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ భార్గవతేజ్, పక్కన డీఆర్వో పెద్ది రోజా తదితరులు

● రిజిస్ట్రేషన్లు కొనసాగించాలి

పెదకాకాని మండలంలోని వెనిగండ్లలో 2004 నుంచి నిలిపివేసిన రిజిస్ట్రేషన్లను తిరిగి కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానికులు వినతి పత్రం అందజేశారు. సర్వే 289-2 బిలో ఉన్న దాదాపు 25.06 సెంట్ల భూమిలో వందేళ్ల నుంచి ఇళ్లను ఏర్పాటు చేసుకుని ఇంటి, నీటి పన్నులు చెల్లిస్తున్నామని, 2004 నుంచి రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని అన్నారు. దీంతో క్రయవిక్రయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీనిపై దేవదాయ శాఖ అధికారులు, తహసీల్దారును కలిసినా పట్టించుకోవడం లేదన్నారు. భూమిని పరిశీలించి భూములను సబ్‌డివిజన్ చేసి నిషేధిత జాబితా నుంచి తొలిగించి రిజిస్ట్రేషన్లను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కె.రంగారెడ్డి, విఠల్‌రెడ్డి, బి.బాబురావు తదితరులు ఉన్నారు.

రైతు బజార్లలో రాయితీ సరుకులు

● బియ్యం, కందిపప్పు, నూనెలు, ఉల్లిపాయలు, టమాటాల విక్రయం

● 'ఆంధ్రజ్యోతి'తో మార్కెటింగ్ ఏడీ రాజబాబు



ఫటా ఫట్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్నంటున్న ప్రస్తుత తరుణంలో కొన్నింటిని తక్కువ ధరకే ప్రజలకు అందుబాటు లోకి తీసుకొచ్చినట్లు మార్కెటింగ్ గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ రాజబాబు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లో కేజీ బీపీటీ పచ్చి బియ్యం రూ. 47, స్టీమ్ బీపీటీ బియ్యం రూ. 48కే అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అలానే కేజీ కందిపప్పు రూ. 150కి తగ్గించి విక్రయిస్తున్నామని చెప్పారు. తాజాగా టమా టాలు కేజీ రూ. 38కి, కర్నూలు ఉల్లిపాయలు కేజీ రూ. 38కి అందుబాటులోకి తీసుకొచ్చా మన్నారు. అలానే లీటర్ పామాయిల్ రూ. 110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 124కి విక్రయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. నాణ్యమైన సరుకులు అందుబాటులో ఉంచుతుండటంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. రైతుబజార్లలో ఎస్టేట్ అధికారుల ద్వారా రెండేసి కౌంటర్లు ఏర్పాటు చేయించి క్యూలైన్ పద్ధతిని పాటిస్తూ అందరికి ఆయా సరుకులు అందేలా చూస్తున్నామని చెప్పారు. దీని వలన బహిరంగ మార్కెట్‌లో ఈ సరుకుల ధరలు దిగి వస్తున్నాయని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.



పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పోలీస్ అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

● ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, అక్టోబరు 21 : పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అమరవీరుల కుటుంబాలకు హామీ ఇచ్చారు. విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబసభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అమరుల కుటుంబ సభ్యులకునగదును పంపిణీ చేశారు. ఇంతకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో పని చేసి జిల్లాలుగా విడిపోయిన తర్వాత వారి కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లాలో నివాసం ఉంటున్న వారు కూడా తమ సమస్యల కోసం నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ చెప్పారు. విధినిర్వహణలో మరణించిన సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని, ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరుపున రావలసిన ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పోలీస్ కుటుంబ సభ్యులకు ఏ సమస్య వచ్చిన తనను నేరుగా కలవచ్చునని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) జీవీ రమణ మూర్తి, ఎఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఎఆర్ డిఎస్పీ శాంత కుమార్, డీపీఓ ఏఓ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డి ఎస్ పి సీతారామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆళహరి శ్రీనివాస్ రావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతి: ఎమ్మెల్యే మాధవి



గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వ మని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లా డుతూ మహాశక్తి పథకం కింద 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వ నున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. 'సూపర్ సిక్స్' హామీలలో భాగంగా ఈ పథకం కింద సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇవ్వబోతున్నా మన్నారు. 'మహాశక్తి' వలన ప్రభుత్వానికి ఏడాదికి మూడు వేల కోట్ల రూపాయల ఆర్థిక భారం పడుతుందని, అయినప్పటికీ దీనిని లెక్క చేయకుండా ఇచ్చిన హామీకి కట్టుబడి దీపావళి నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డుదారులను ప్రామాణికంగా తీసుకుంటే సుమారు 1.40 లక్షల మంది లబ్దిదారులకు మేలు చేకూరుతుందని అన్నారు.

● పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

అసాంఘిక శక్తుల నుంచి ప్రజలను రక్షించే ప్రయత్నంలో విధి నిర్వహణలో ఎంతో మంది పోలీసులు ప్రాణాలు కోల్పోతున్నారని, వారి త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే మాధవి అన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి సేవలను ఆమె స్మరించుకుంటూ వారికి నివాళులు అర్పించారు. విధినిర్వహణలో అమరులైన పోలీసులకు ఆత్మశాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉర్దూ ప్రాధాన్యం పెంచే కొత్త పథకానికి శ్రీకారం

● ఎమ్మెల్యే నసీర్



స్వీట్లు పంచి సంతోషం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ విద్యార్థులకు మేలు చేకూరేలా ముఖ్యమంత్రి చంద్రబాబు 'చంద్రన్న మద్రాసా' నవీన విద్యా పథకానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక చంద్రబాబునాయుడు కాలనీ ఒకటో లైనులోని మజాహిరుల్ ఉలూమ్ మద్రాసాలో విద్యార్థులకు సోమవారం మిఠాయిలు పంచి పథకం రూప కల్పనపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా మంత్రి నారా లోకేశ్, మైనారిటీ మంత్రి ఎండి ఫారూఖ్ చొరవతో 'చంద్రన్న మద్రాసా నవీన విద్యా పథకం' ద్వారా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ భాష ఉపాధ్యాయులు, వలంటీర్లను అందుబాటులోకి తెచ్చి ఉర్దూ ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో మదర్సా పెద్దలు మౌలానా ఫేజుల్ల, మైనార్టీ నాయకులు పఠాన్ జామీర్, ఉస్మాన్, రఫీ, రసూల్, హిస్సేన్, బాజీ మాస్టర్, పాల్గొన్నారు

దాతల సహకారం మరువలేనిది

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్



సామినేని, చుక్కపల్లి రమేష్‌కు చెక్కును అందజేస్తున్న నూతక్కి రామకృష్ణ ప్రసాదు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు అందజేస్తున్న సహకారం మరువలేనిదని కమ్మ జన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు అన్నారు. నూతన భవన నిర్మాణానికి ప్రవాస భార తీయుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు రూ కోటి 25 లక్షల చెక్కును గుంటూరులోని కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహ ఆవరణలో సామినేని, చుక్కపల్లి రమేష్‌లకు చెక్కును ఆయన అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన భవన నిర్మా ణానికి గతంలో రూ 25 కోట్ల విరాళాన్ని రామకృష్ణ ప్రసాదు ప్రకటించారని, ఇప్పటి వరకు రూ.8 కోట్లు అందజేశారని వివరించారు. విరా ళంలో భాగంగా సోమవారం రూ.1 కోటి 25 లక్షల చెక్కును అందజేశారని అన్నారు. ఇంత పెద్ద మొత్తాన్ని విరాళాన్ని అంద జేస్తున్న రామకృష్ణ ప్రసాదుకు కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచిం చారు. కార్య క్రమంలో పాలకవర్గ సభ్యులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైతు శాస్త్రవేత్తలు పంటల ఆరోగ్యం పై అధ్యయనం చేయాలి

గుంటూరు సిటీ, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ,రసాయన వ్యవసాయ పంటల ఆరోగ్యం, నేల ఆరోగ్యం పై రైతు శాస్త్రవేత్తలు నిరంతరం అధ్యయనం చేయాలని ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రో-ఎకోలాజికల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్‌కు చెందిన ఈడీ శామ్యూల్ ఆనంద్ అన్నారు. స్థానిక కృషి భవన్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతు శాస్త్రవేత్తలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

విజ్ఞాన్‌లో వర్సిటీ అంతర కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

గుంటూరు(విద్య),అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు పలకలూరు లోని విజ్ఞాన్ డిగ్రి కళాశాలలో సోమవారం ప్రారంభ మయ్యాయి. వివిధ డిగ్రీ కళాశాల నుంచి 18 కబడ్డీ టీములు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ప్రిన్సి పాల్ వి.అనురాధ, విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపాల్ పి రాధిక, యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యు కేషన్ డాక్టర్ పీపీఎస్ పాల్‌కుమార్, నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాతూరి శ్రీనివాస్, నాగార్జున యూనివర్సిటీ టీం సెలక్షన్ కమిటీ మెంబర్స్ గణేష్, ప్రేమ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్స్ తదితరులు పర్యవేక్షించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరం అని, క్రీడల వల్ల మానసిక ఒత్తిడి గురికాకుండా ఉంటారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ప్రతాప్, హరికృష్ణ పాల్గొన్నారు.

జిల్లాలో రేపు పర్యటించనున్న వైసీపీ అధినేత జగన్

● జీజీహెచ్‌లో తెనాలి యువతికి పరామర్శ

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన ఘటనలో అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువతి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన జగన్ బుధవారం ఉదయం తాడేపల్లి నివాసం నుంచి గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధిత యువతిని, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పెట్టుబడిదారుల మేలు కోసమే జమిలి ఎన్నికలు

● రాష్ట్రాల హక్కులను హరించడమే లక్ష్యం

● సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న బీవీ రాఘవులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమిలి ఎన్నికల నినాదాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. లెనిన్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సమకాలీన రాజకీయ పరిణామాలపై నిర్వహించిన సభలో ఆయన ప్రసం గించారు. సభకు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు. రాఘవులు మాట్లాడుతూ దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వ హించేందుకు హేతుబద్ధత లేని సాకులను మోదీ ప్రభుత్వం చెబుతోందని విమ ర్శించారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలను ఒక దశలో నిర్వహించలేక ఏడు దశల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలు ఒకేసారి ఎలా నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికే పోలీసు బలగాలు సరిపోక ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి పంపుతున్నారని, జమిలి ఎన్నికలు నిర్వహిస్తే మిలటరీ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుపుతారా అని ప్రశ్నించారు. ఒక వైపు రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం జమిలీ ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలన్నింటిని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు ఎత్తుగడ వేస్తోందని అన్నారు. జమిలి ఎన్నికలు జరిగితే దేశంలో ప్రజాస్వామ్యం అంతరించిపోయి నియంతృత్వం ఏర్పడుతుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు, వక్ఫ్ చట్ట సవరణ, విదేశాంగ విధానం, ఆర్థిక వ్యవస్థ మొదలైన అంశాలపై ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మోదీ వైఖరితో దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించలేకపోతోందని అన్నారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ, ఈమని అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎమ్.రవి, ఎస్.ఎస్.చెంగయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆలపాటి కృతజ్ఞతలు



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆలపాటి

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను ఎంపిక చేసినందుకు ఆయనకు ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, టీడీపీ బ్రాహ్మణ సాధికార రాష్ట్ర అధ్యక్షుడు బుచ్చిరామ్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

గిరిజనులను మరింత ముందుకు తీసుకెళ్తాం

● టీడీపీఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారూనాయక్‌కు సీఎం హామీ



గిరిజన సమస్యలపై సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న ధారూనాయక్

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో గిరిజనులను అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ధారూనాయక్ చెప్పారు. ముఖ్యమంత్రిని సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయంలో కలిసిన ధారూనాయక్, గిరిజనుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాల మోసం చేసిందని, గిరిజనులపై అక్రమాలు, దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురిచేసిందని సీఎంకి వివరించినట్లు చెప్పారు. నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గిరిజనులు అన్ని విధాల మంచి జరుగుతుందని కోరుకుంటున్నారన్నారు. ఎలాంటి ఇబ్బందులకు తావ ులేకుండా గిరిజనుల అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారని చెప్పారు, రాబోయే రోజు లలో గిరిజనులను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

విద్యార్థుల మానసిక వికాసం కోసం బాలోత్సవ్



వేడుకలను ప్రారంభిస్తున్న ఎంహెచ్‌వో రామారావు తదితరులు

గుంటూరు(విద్య),అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల మానసిక వికాసం కోసం బాలోత్సవ్ వేడుకలు ఉపయోగపడతాయని నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో రామారావు అన్నారు. ఎన్జీవోకాలనీలోని సుమేధ స్కూల్‌లో సోమవారం బాలోత్సవ్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శారీరక మానసిక వికాసం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు .కార్యక్రమంలో ఎన్‌జీసి జిల్లా కోఆర్డినేటర్ డి తిరుపతిరెడ్డి, ముఖ్యుడు శ్రీహరి,పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో రౌడీ షీటర్ అరెస్ట్

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శారద కాలనీ ఆర్చి సెంటర్లోని విజయసారధి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన రౌడీషీటర్ చింతకుంట్ల ప్రవీణ్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు.

వృద్ధురాలిని బురిడి కొట్టించి లక్షతో ఉడాయింపు

ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి లక్ష రూపాయలతో ఉడాయించిన ఘటనపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్ నగర్ 4/2 కు చెందిన చెరుకూరి రమణ పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. ఆమె ఒంటరిగా ఉంటుంది. ఇదిలా ఉంటే సోమవారం ఉదయం ఓ యువకుడు స్కూటీపై ఆమె ఇంటికి వచ్చాడు. 'చంద్రబాబు మీకు ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, మిక్సీ ఉచితంగా ఇస్తున్నారు'అని చెప్పాడు. ఇందుకుగాను పసుపు చీర ధరించి రూ.20 వేలతో ఫోటో దిగాలని చెప్పాడు. దీంతో అతను చెప్పినట్లుగానే బాధితురాలు చేసింది. దుస్తులు ధరించి 50 నోట్ల కట్టలు రెండు అంటే లక్ష రూపాయలతో వచ్చింది. అగంతకుడు ఎర్ర చీర కూడా కావాలని చెప్పడంతో ఆమె చీర తెచ్చేందుకు లోపలకి వెళ్ళగా అక్కడ ఉంచిన లక్ష రూపాయలతో అగంతకుడు ఉడాయించాడు. బాధితురాలు రమణ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పట్టాభిపురం సిఐ వీరేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

వ్యాసరచన పోటీలో విజేతలకు సర్టిఫికెట్లు పంపిణీ

గుంటూరు(విద్య),అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వ్యాచ రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జేసీ భార్గవ్‌తేజ సర్టిఫికెట్లు అందజేశారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం ఓకార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో మొదటి స్థానం సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వేజెండ్ల) విద్యార్థిని ఎస్కే అఫ్రీన్‌కు జేసీ రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. డీఈవో పి.శైలజ, ప్రధానోపాధ్యాయులు తిరుపతి విజయశ్రీ, ఉపాధ్యాయులు ఎం.సుబ్బారావు, చంద్రశేఖర్ కె.శ్రీనివాసరావు, జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అల ద్వారకాపురిలో..



ద్వారకాపురిలోని శిథిల దేవాలయం



చేనేత వస్త్రాలకు రంగులు వేసే ప్రాచీన అద్దకపు యూనిట్



బుగ్గవాగు రిజర్వాయర్ ముంపునకు గురై శిథిలావస్థకు చేరిన పురాతన బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం

- కనుమరుగైన ప్రాచీన నగరం
- ఎనిమిది శతాబ్దాల క్రితం పట్టణ విధ్వంసం
- నేటికీ పురావస్తుశాఖ దృష్టికి రాని వైనం

ఆ నగరం పేరు ద్వారకాపురి.. 12వ శతాబ్దంలో దాని వైభవం అంతా ఇంతా కాదు.. ఒకవైపు సిరి సంపదలతో తులతూగుతుండగా.. మరోవైపు సంగీత, సాహిత్య శిల్పకళలకు కాణాచిగా నిలిచిందని తమ పూర్వీకులు చెప్పే వారని స్థానికులు చెబుతున్నారు. అయితే రాచరిక వ్యవస్థలో స్వర్ణయుగం చవిచూసిన ఆ పట్టణం రాత్రికి రాత్రే నేలమట్టమైంది.. పట్టణ ప్రజలంతా తెల్లారేసరికి నిర్జీవులయ్యారు.. ఎక్కడ చూసినా శవాల గుట్టలే.. బతికి బట్టకట్టిన వారు చెట్టుకొకరు.. పుట్టకొకరు.. ఈ ఘోర విపత్తుకు కారణం అర్ధరాత్రి శత్రుమూకల దాడో.. భూకంప ప్రళయమో.. కబళించిన కలరా మహమ్మారో తెలీదు.. కారణం ఏదైతేనేం నాగరికతతో విలసిల్లిన ఈ పట్టణం ఒక్క రాత్రిలోనే కాలగర్భంలో కలిసి చరిత్ర నుంచి అదృశ్యమైందని అక్కడి పెద్దలు కథలు కథలుగా చెబుతారు. దుర్గి మండలం ధర్మవరం పరిధిలో శిథిలావస్థలో దర్శనమిస్తూ నాటి చారిత్రక ఆనవాళ్లను ఇంకా దాచుకున్న ద్వారకాపురి వృత్తాంతం తెలుసుకోవాలంటే అక్కడకు వెళ్లాల్సిందే..

మాచర్లటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ద్వారకాపురి పట్టణం సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో సగభాగం బుగ్గవాగు రిజర్వాయర్‌లో మునిగిపోగా, మిగిలిన సగభాగం వ్యవసాయ భూమిగా మారింది. వ్యవసాయ భూమిలో ఎక్కడ చూసినా పగిలిపోయిన కుండ పెంకులు, గాజుముక్కలు కనిపిస్తుంటాయి. అంగుళానికి ఈ కుండపెంకులు విస్తరించి కనిపిస్తున్నాయి. రైతులు దుక్కి దున్నుతున్నప్పుడు మట్టికుండలు, పిడతలు పైకి రావడం సర్వసాధారణం. పొలం గట్లపై పలు దేవతామూర్తుల విగ్రహాలు పడి దర్శనమిస్తాయి. వీటిలో నాగదేవత, వినాయకుడు, గజలక్ష్మి, ఏనుగును అధిరోహించిన వీరవనిత తదితర విగ్రహాలు ఉన్నాయి. చేనేత వస్త్రాలకు రంగులు తయారుచేసే ఒక యూనిట్ ఈనాటికీ శిథిలావస్థలో అక్కడ దర్శనమిస్తుంది. ఈ ప్రాంతంలో కొంతభాగాన్ని నాగులకట్ట, మరికొంత భాగాన్ని కుమ్మరిగుట్ట అని పిలుస్తుంటారు. ఈ భూములను సాగు చేస్తున్న రైతులకు తరచూ బంగారు నాణాలు, ఆభరణాలు ఇప్పటికీ లభిస్తున్నాయి. ఇక్కడ నాలుగు శిథిలయాలు కూడా ఉన్నాయి. ఈ ఊరికి పక్కన నిరంతరం నీరు ప్రవహించే బుగ్గవాగు ఉండగా, వాగుకు ఆవలవైపు బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం మెట్లకు దిగువభాగాన పాతాళగంగా నిరంతరం భూమిపైకి పొంగుతూ ఉంటుంది. ఆ నీరు ఆనాటి ద్వారకాపురి పట్టణ వాసుల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేది. 1964లో నిర్మించిన బుగ్గవాగు రిజర్వాయర్ వల్ల బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు భూమిపైకి ఉబికి వచ్చే పాతళగంగ కూడా మునిగి ఉనికి కోల్పోయ్యాయి.



ప్రతి అంగుళానికి దర్శనమిచ్చే కుండపెంకులు





పొలం గట్లపై దీనావస్థలో ఉన్న శిలా విగ్రహాలు

ద్వారకాపురి విధ్వంసం ఇలా జరిగిందట..

శిథిల ఆలయం ముందు కనిపిస్తున్న శిలాశాసనంలో ఓరుగల్లు రాజుల ప్రసక్తి ఉంది. దీన్ని బట్టి 12వ శతాబ్దంలో ఈ పట్టణం విలసిల్లినట్లు ఊహించవచ్చు. వైభవ ప్రాభవాన్ని అనుభవించిన ఆ పట్టణం ఎందుకు శిథిలస్థితికి చేరిందో ఇప్పటికీ అర్థం కాదు. ఆనాటి ముస్లిం రాజుల దండయాత్ర వల్లనో.. లేక ప్రకృతి వైపరీత్యాల కారణంగానో ద్వారకాపురి విధ్వంసానికి గురై ఉండవచ్చు. అయితే స్థానికులు మరో కథనం చెబుతుంటారు. శ్రీశైలం అడవుల్లో నివసించే చెంచు తెగల దాడి వల్లనే ఈ పట్టణం ధ్వంసమైందని ఈప్రాంత వాసులు విశ్వసిస్తున్నారు. వారి కథనం ప్రకారం.. చెంచు తెగకు చెందిన ఓ మహిళ తేనె అమ్మడానికి తన కుక్కతో ఈ పట్టణానికి వచ్చింది. ఓ ఇంట్లో తేనె విక్రయిస్తుండగా ఆ తిరుగుతున్న పిల్లిని చూసి ఆ కుక్క దానిపై దాడి చేసి చంపింది. ఈ విషయమై ఆ చెంచు మహిళకు, ఆ కుటుంబసభ్యులకు ఘర్షణ జరిగి చివరకు ఆ తేనే అమ్ముకునే మహిళ హత్యకు దారితీసింది. ఆమె హత్య విషయం తెలుసుకున్న చెంచులు ప్రతీకార జ్వాల రగిలించింది. రాత్రికి రాత్రే ద్వారకాపురి పట్టణంపై దాడి చేసి మగవారి గొంతుకులు కోశారని, ఈ దాడితో పట్టణం శవాల గుట్టలతో శ్మశానంగా మారిందని. మగ దిక్కు కోల్పోయిన మహిళలంతా పట్టణం వీడిపోగా, తప్పించుకున్న మగవారు కొన్నాళ్లకు తిరిగివచ్చారు. వారిలో కొందరు ధర్మవరంలో అంతర్భాగంగా ఉన్న దారివేముల గ్రామాన్ని ఏర్పరుచుకోగా, కొందరు దుర్గి ప్రాంతానికి వచ్చి నేటి దుర్గి గ్రామాన్ని నిర్మించుకున్నారు.

పురావస్తు శాఖ దృష్టికి రాని నాటి ద్వారకాపురి చరిత్ర

చరిత్ర నుంచి అదృశ్యమైన నాటి ద్వారకాపురి చరిత్ర నేటికీ పురావస్తు శాఖ దృష్టికి రాలేదు. అపురూప శిల్పసంపద, శిలాశాసనాలు, చారిత్రక అవశేషాలకు నిలయమైన ద్వారకాపురి ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి నిలువటద్దంలా నిలిచి ఉంది

ఘనంగా కశ్మీర్ యువ సమ్మేళనం

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో భారత ప్రభుత్వము, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ,



గుంటూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నేటి నుంచి 6 రోజుల పా టు జరిగే 4వ కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం డాక్టర్ వేణుగోపాలరెడ్డి సెమినార్ హాల్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కశ్మీర్‌లోని ఆరు జిల్లాలైన పుల్వామా, బుడ్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ నుంచి మొత్తం 132 మంది యువతి, యువకులు హాజరయ్యారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన నెహ్రూ యువకేంద్రాల్లో గత మూడేళ్లుగా జరుగుతుందన్నారు. కశ్మీర్ యువ సమ్మేళనం కార్యక్రమం నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, కశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తుందన్నారు. అలాగే కశ్మీర్ యువతకు ఇక్కడి సంస్కృతి, సంప్రదా యాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అల వాట్లు సహా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు యువ సమ్మేళనంలో వివరిస్తారని అన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఆచార్య



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు

నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధరరావు మాట్లాడుతూ దేశంలో యువ త ఎక్కువగా ఉన్నారని, జాతీయ ఐక్యత, సమ గ్రత, శాంతి ప్రతిపాదకులుగా వ్యవహరించేలా అవగాహన కల్పించడం, అలాగే దేశంలోని సాంస్కృతిక, పారిశ్రామిక, చారిత్రక, పర్యాటక విద్యా పరమైన ప్రముఖ ప్రదేశాలను సందర్శిం చేందుకు అవకాశం యువ సమ్మేళనం వలన కలుగుతుం దని తెలిపారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లా డుతూ వివిధ అంశాలపై రెండు రోజుల క్షేత్రస్థాయి సందర్శన ఉందనీ, ప్రతి శాఖ సహ కారంతో నిర్వహిస్తున్నామని అన్నారు. యూని వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహచలం, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్యతేజో మూర్తి, ఓఎస్ డీ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవి కుమార్, డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి, నెహ్రూ యువ కేంద్ర వైజాగ్ జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు గౌరవ అతిథులుగా హా జరై ప్రసంగించారు. కార్యక్రమంలో కశ్మీర్ యువత సాంస్కృతిక ప్రదర్శనతో సందడి చేశారు.

(5వ పేజీ తరువాయి)

274 సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. 274లో 55 సంఘాలు మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్నాయి. ఈ సారి కౌలు రైతులకు ఓటు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగు నీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత

సంఘాలు ఏర్పాటయ్యాయి. చివరిసారిగా 2015లో ఎన్నికలు జరిగాయి. 2020తో కాలపరిమితి ముగిసింది. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణను విస్మరించింది. దీంతో సాగు నీటి కాలువల నిర్వహణలో రైతుల భాగస్వామ్యం లేకుండా చేసింది. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే సాగు నీటి సరఫరా.. కాలువ మరమ్మతుల్లో అవి కీలక పాత్ర పోషిస్తాయి. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగానే నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఐదేళ్లు నిర్వీర్యమైన సాగు నీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. జనవనరులలో రైతులను భాగస్వాములను చేస్తోంది. నీటి పంపిణీలో రైతులకు కీలక పాత్ర కల్పించనుంది.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

సాగునీటి రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక సంఘాలను గుర్తించి వీటిలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలకు రైతుల ఓటర్ల లిస్టుల తయారీ బాధ్యతలను రెవిన్యూ శాఖకు అప్పగించారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల

సాగు నీటి సంఘాల.. ఎన్నికల నగారా

ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగనుంది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తికానుంది. ఎన్నికల ప్రక్రియను జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ఇందులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. 21న ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం 40 రోజుల్లో ముగియ నుంది. ఈసారి కౌలు రైతులకు ఓటు హక్కును కల్పిస్తున్నారు. నీటి సంఘాల పరిధిలో టీసీలను 31న ప్రకటించను న్నారు. వీటిపై అభ్యంతరాలను 1 నుంచి స్వీకరిస్తారు. 3న టీసీల తుది జాబితాను విడుదల చేస్తారు. 3న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. 6న భూ యజమానుల జాబితా(ఓటర్ల)ను రూపొందించే ప్రక్రియ ప్రారంభమై 10న ముగుస్తుంది. 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, 13నఅభ్యంతరాల పరిష్కా రం, ఓటర్ల తుది జాబితాలను ప్రకటిస్తారు. 20న నీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యా యూఏ) నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. 21న డబ్ల్యాయూఏలకు ఎన్నికలు నిర్వహిస్తారు. 21 నుంచి 23 తేదీలలోపే సంఘాల సభ్యులు, అధ్యక్షు డు, ఉపాధ్యక్షుడి ఎన్నికలను పూర్తి చేస్తారు. 24 నుంచి 26 తేదీలలో నీటి పంపిణీ సంఘాలు (డీసీ)లు, 27 నుంచి 29 తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీ(పీసీ) కార్యవర్గ ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంది.

తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు.. రైతుల్లో సంతోషం

సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 2003లో తొలిసారిగా సాగునీటి వినియో గదారుల

భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటేనే ఓటరు

సాగు నీటి సంఘాలకు ఎన్నికలకు సంబంధించి రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉంటే రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సాగునీరు సరఫరా చేసే ప్రాంతాల్లో భూములు ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా సాగు నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పిస్తున్నారు. డబ్ల్యాయూఏకు కమిటీలను టీసీ సభ్యులు ఎన్నుకుంటారు. ఈ సంఘాలు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటాయి. డీసీల నుంచి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

శాఖ గుర్తించింది. మైనర్ ఇరిగేషన్ అంటే చెరువుల కింద సాగు చేస్తున్న ఆయకట్టు రైతులకు ఓటు హక్కు కల్పిస్తారు. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను సంబంధిత శాఖ సేకరించింది. ఒక్కొక్క నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఇందుకు సంబంధించి అయకట్టు పరిధిలో సర్వే నెంబర్లు సేకరించారు. ఏ సర్వే నెంబర్‌లో ఎంత మంది రైతులు ఉన్నారు, వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు అధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తాయి.

దృష్టి సారించిన ప్రధాన పార్టీలు

సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా స్వీకరిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి ఎన్నికలపై పార్టీలు దృష్టి సారించాయి. రైతుల వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు నేతలు సమాయత్తమయ్యారు.

కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్



సమస్యలపై ఆశా వర్కర్ల మెరుపు ధర్నా

- ఏపీఐఐసీ భవనం వద్ద బైఠాయించి నిరసన

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు సోమవారం మంగళగిరిలో మెరుపు ధర్నా నిర్వహించారు. తొలుత చినకాకాని ఎన్నారై ఆసుపత్రి వద్ద నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరి ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ భవనం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ అనిల్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడంలో ఆశా వర్కర్లు ముఖ్యభూమిక పోషిస్తున్నారని చెప్పారు. ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి ఫలితం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు వారి పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.6 వేలు కూడా నేటికీ ఇవ్వలేదన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, రాజకీయ నేతలు, అధికారుల వేధింపులు మానుకోవాలని, అనుభవం కలిగిన ఆశా వర్కర్లకు తగిన శిక్షణ ఇచ్చి ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, మెడికల్ ఉద్యోగులకు వర్తించే అన్ని సదుపాయాలను కల్పించాలని, డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపు కార్డులను జారీ చేయాలని, రూ.పది లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి, రాష్ట్ర ఇన్‌చార్జి ఎస్.వెంకట సుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఎస్.వెంకటేశ్వరరావు, గోపాల్, అమ్ములు, నాగమణి, చంద్రశేఖర్, చందా మైర్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఐఐసీ భవనం వద్ద బైఠాయించి నిరసన చేస్తున్న ఆశా వర్కర్లు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏఎన్‌యూ భారీ విరాళం

- ఉద్యోగుల వితరణపై చంద్రబాబు అభినందన




సీఎం చంద్రబాబుకు విరాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర, వర్సిటీ వీసీ ఆచార్య కే గంగాధరరావు, అధికారులు

పెదకాకాని, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) ఉద్యోగులు భారీ విరాళం రూ.18,22,106ను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి అందజేశారు. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహా చలం, వర్సిటీ అధికారులు సీఎంను కలిశారు. ఉద్యోగులు అందించిన విరాళంపై సంతోషం వ్యక్తం చేసిన సీఎం, ఉద్యోగులను అభినందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ఉద్యోగుల ప్రథమ కర్తవ్యంగా భావించి సహకారం అందించడం హర్ష ణీయమని అన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని వర్సిటీ అధికారులకు సూచించారు. వర్సిటీ అభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తనవంతు సహకారం అందిస్తుందని అన్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విజయవాడలో సంభవించిన వరదల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేకమైన చర్యలు అభినందనీయమని ప్రశంసించారు. ఆచార్య వి. రవికుమార్, ఆచార్య ఎం.సుబ్బారావు, ఆచార్య జి.రత్నాకర్, డాక్టర్ జి.అనిత, డాక్టర్ ఎ వి వి ఎస్ స్వామి, డాక్టర్ గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజ్ బాధిత మిర్చి రైతులకు న్యాయం

- కేంద్ర మంత్రి పెమ్మసాని చొరవపై రైతుల హర్షం

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర శివారులోని నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర, తియ్యగూర కోల్డ్‌స్టోరేజ్‌లలో రైతులు కమీషన్ వ్యాపారి ద్వారా వాటిల్లో నిల్వ ఉంచడం, ఆయా కోల్డ్ స్టోరేజ్‌లను అనధికారికంగా సబ్‌లీజుకు తీసుకున్న వ్యక్తి, రైతుల మిర్చిని వారికి తెలియకుండానే విక్రయించడం, నకిలీ బాండ్లు సృష్టించి బ్యాంకుల్లో పెట్టి రుణాలు కూడా తీసుకున్న విషయం గత 20 రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. మొత్తం 32 మంది రైతులకు రూ. 1.60 కోట్లు చెల్లించాల్సి రావడంతో కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమాని వద్ద వసూలు చేయించారు. రైతుల మిర్చికి క్వింటాల్‌కు రూ. 13 వేల చొప్పున లెక్క కట్టి సోమవారం నగదు విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ పేదలు, రైతుల బల హీనతలను అడ్డు పెట్టుకొని మోసం చేస్తే వాళ్లు ఎంతటి వారైనా వదిలిపెట్టబోమన్నారు. రైతుల్లో కొందరు ఒక వ్యాపారి వద్ద నగదు తీసుకొని సరుకుని వేరొక వ్యాపారికి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ విషయంలో రైతులు కూడా ధర్మబద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే రామాంజనేయులు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరీ ఐ వెంకటేశ్వరరెడ్డి, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దాదాపు రూ. 1.60 కోట్లను చెక్కుల రూపంలో అందజేయించడంతో గుంటూరు, పల్నాడు, కర్నూలు, ప్రకాశం జిల్లాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోల్డ్‌స్టోరేజ్ బాధిత రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పెమ్మసాని

రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు దుగ్గిరాల విద్యార్థిని

దుగ్గిరాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎస్కే నార్సిన్ రాష్ట్రస్థాయి షటిల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శోభాదేవి తెలిపారు. జిల్లాస్థాయిలో పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నార్సిన్‌ను ఉపాధ్యాయినులు, గ్రామస్థులు అభినందించారు.

వడ్డేశ్వరంలో వైద్యశిబిరం

తాడేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ఆరోగ్య సంజీవని రథం ద్వారా, విజయవాడ శంకర నేత్ర చికిత్సాలయం ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. సంజీవని ఆరోగ్య రథం వారు 90 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శంకర నేత్ర చికిత్సాలయం ప్రతినిధులు 80 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నేత కాట్రగడ్డ మధుసూదనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, చావలి సురేష్, అబ్దుల్ గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

కాకుమాను, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ఆధార్ కార్డుల్లో మార్పులు, అప్‌డేట్ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యుగకీర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం, బుధవారం బీకే పాలెం గ్రామ సచివాయంలో, అలాగే బోడిపాలెంలో, 24, 25 తేదీల్లో చిన్నలింగాయపాలెంలో, రేటూరులో ఆధార్ సేవలు అందిస్తారని తెలిపారు.

● మేడికొండూరు అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యార్థుల ఆధార్ కార్డులో మార్పులు, సవరణల కోసం మండలంలోని 7 జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో తోట చందన సోమవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 25వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

● ఫిరంగిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం గ్రామ పంచాయతీలో గల మార్నింగ్ స్టార్ జూనియర్ కళాశాలలో రెండు ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో సోమవారం తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆధార్ క్యాంపు ఉంటుందన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

పెదనందిపాడు, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని 12 గ్రామాల్లో మంగళవారం నుంచి నవంబరు 7వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శంకర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జోన్ డైరీ

● నేడు రైతు సేవా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

● నేడు మేడికొండూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తారు.

గుంటూరు ఛానెల్, నల్లమడ డ్రెయిన్ల సమస్య త్వరలో పరిష్కారం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


పెమ్మసానికి గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

ప్రత్తిపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ఛానెల్ పొడిగింపు, నల్లమడ డ్రెయిన్ల సమస్యలను త్వరలో పరిష్కరించి తాగు, సాగు నీరు అందిస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రత్తిపాడులో సోమవారం పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలో గుంటూరు పార్లమెంట్‌కు అత్యధిక నిధులు తీసుకువచ్చామన్నారు. ఆ నిధులు రాష్ట్రానికి అప్పుగా ఇచ్చారని ప్రతిపక్షనేతలు దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో నిలిచిపోయిన ఈఎస్ఐ 100 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. గడిచిన ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి కానీ ఎలాంటి రోడ్డు నిర్మాణాలు చేపట్టిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడమే కాకుండా అంతర్గత రహదారులకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. రాబోయే 40 ఏళ్లకు సరిపడా అభివృద్ధిని చేసి చూపుతామన్నారు. ఈ ప్రాంత ప్రజలందరూ నమ్మకంతో నాకు ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించారని, మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు.

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమం దిశగానే ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఉచిత ఇసుకను నిర్మాణాల కోసం తీసుకెళ్తుంటే రెవెన్యూ, పోలీసుశాఖ వారు అడ్డుకుంటే తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, తెలుగుయువత మండల అధ్యక్షుడు చిన్నం శ్రీకాంత్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, దక్కుమళ్ల భాగ్యారావు, గొరిజవోలు వెంకటేశ్వరరావు, కాకాని సురేష్, అయినంపూడి నాగేశ్వరావు, పలుశాఖల అధికారులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పెమ్మసానికి ఘనస్వాగతం

తొలిసారిగా ప్రత్తిపాడుకు విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కి టీడీపీ మండల, తెలుగుయువత నాయకులు ఘన స్వాగతం పలికారు. కోయవారిపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొని అనంతరం ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీగా ప్రత్తిపాడు చేరుకున్నారు. ఆయనను గజమాలతో సత్కరించారు.

వరదసాయం అక్రమాలపై పూర్తయిన విచారణ

● రూ.16.14లక్షలు తిరిగి చెల్లించిన నకిలీ రైతులు

● అధికారులను వివరణ కోరిన విచారణ అధికారులు

మేడికొండూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలో వరద సాయం అక్రమాలు దాదాపుగా బహిర్గతమయ్యాయి. పంట నష్టం పరిహారం కింద ప్రభుత్వం పంపిణీ చేసిన సాయంలో సోమవారం నాటికి రూ.16.14లక్షలు నకిలీ రైతులు తిరిగి చెల్లించారు. ఇప్పటి వరకు పంట నష్టం పరిహారం పొందిన జాబితాలో ఉన్న వారిని విచారించిన అధికారులు సోమవారం జాబితా రూప కల్పనలో బాధ్యులైన అధికారులను విచారించి, వారిని రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. కౌలు రైతుల పేరుతో వరద సాయం స్వాహా పేరిట ఈ నెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తా కథనంపై ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. పంట నష్టం స్వాహాపై విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని జిల్లా ఉన్నతాధికారులకు పిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు మూడు బృందాలను నియమించి మేడికొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టారు. విచారణ పూర్తయిన అనంతరం మేడికొండూరుకు చెందిన బోడెపూడి జోగేశ్వరరావు, వ్యవసాయశాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్న నాగరాజు అనే ఇద్దరు కౌలు రైతుల పేరిట పంట నష్టం పరిహారం స్వాహా చేశారని తేలింది. ఒక్క వెలవర్తిపాడులోనే 104మంది రైతులకు సుమారు రూ.18 లక్షలు పరిహారం కింద ప్రభుత్వం రైతుల ఖాతాలో వేసింది. అందులో రూ.16.14లక్షలు తమకేమి తెలియదంటూ కౌలు రైతుల పేరిట సాయం పొందిన వారు తిరిగి చెల్లించారు. తిరిగి చెల్లించిన వారిలో పంట వేసిన రైతులు లేక పోవడం విశేషం. విచారణ ప్రారంభం కాగానే జాబితాలో పంట సాయం పొందిన వారు ఆ ఇద్దరిపై ఆగ్రహం వ్యక్తం చేయగా తాము స్వాహా చేసిన సొమ్మును తిరిగి వారికి ఇచ్చి విచారణ అధికారుల వద్దకు పంపారు. రాతపూర్వకంగా వాంగ్మూల మిచ్చి డబ్బు చెల్లించారు.

కొనసాగుతున్న విచారణ

మండలంలో భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి సమీప పొలాలను ముంచెత్తిన సంగతి వాస్తవమే అయినప్పటికీ అధికారులు చూపిన మేర పంట నష్టం జరగలేదనేది ఆయా ప్రాంత రైతులు చెబుతున్నారు. కొంత మేర పంట నష్టపోయిన రైతులు ఉన్నప్పటికి వారికి పంట నష్టం అందలేదు. వ్యవసాయ శాఖలోని కొందరు అధికారులు, వారికి వత్తాసుగా కొందరు వీఆర్వోలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పూర్తి పంట నష్టం జరిగినట్టుగా జాబితా రూపొందించారు. ఆ జాబితాలో ఎక్కువ మంది వ్యవసాయం చేయని కౌలు రైతులున్నారు. వీరు ఆయా సర్వే నంబర్లలో భూములు కౌలుకు చేస్తున్నట్టు కార్డులెలా ఇచ్చారు. వారిని జాబితాలో ఎలా చేర్చారు అన్న దానిపై విచారణ కొనసాగుతుంది. పంట నష్టం జరిగిన భూములను పరిశీలిస్తే మరికొన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

వరగానిలో అక్రమాలు

మండలంలోని వరగానిలో కూడా అధికారులు అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. ఆ గ్రామంలో 80 మంది రైతులు 8లక్షల 7వేల 500 రూపాయలు పంట నష్టపరిహారం కింద పొందారు. సుమారు 47 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్టు అధికారులు అంచనాలు తయారు చేశారు. ఈ జాబితాలోను అక్రమాలున్నాయని ఆయా ప్రాంత రైతులు చెబుతున్నారు. అసలు పంట నష్టం జరిగిన వారివి కాకుండా ముడుపులు ఇచ్చిన వారి పేర్లను జాబితాలో చేర్చారని విమర్శిస్తున్నారు. విచారణ అధికారులు భూములు పరిశీలించి వాస్తవంగా నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు. ఇప్పటికే మరికొన్ని గ్రామాల నుంచి తమకు పంట నష్టం అందలేదని విచారించి న్యాయం చేయాలని కొందరు రైతులు విచారణ అధికారులకు రాతపూర్వకంగా వినతి పత్రాలు అందించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి నారా లోకేశ్ స్థానిక టీడీపీ నాయకుల ద్వారా సోమవారం అందజేయించారు. 22వ వార్డు


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

లక్ష్మీనరసింహస్వామి కాలనీకి చెందిన పోలన శ్రీనివాస రావుకు రూ.2 లక్షలు, 27వ వార్డు టిడ్కో సముదాయానికి చెందిన జంజనం వెంకట సాంబశివరావుకు రూ.20 వేలు, మునగాల సాంబశివరావుకు రూ.25 వేలు, 31వ వార్డుకు చెందిన షేక్ రజియా బేగంకు రూ.25 వేలు, మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కొమ్మూరు మరియ రోజాకు రూ.50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. తమకు సీఎం సహాయ నిధి చెక్కులు మంజూర య్యేందుకు కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్య దర్శి అబ్దుల్ మజీద్, నేతలు వాకా మాధవరావు, షేక్ కరీముల్లా, ఉద్దంటి ఆంజనేయులు, మాచర్ల శ్రీనివాసరావు, కాశిన కొండలరావు, భలబద్ర రమేష్, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైలో 300 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు


ఎన్నారై వైద్య బృందంతో అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం చినకాకాని ఎన్నారై వైద్య శాలలో 300 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తిచేసినట్టు నెఫ్రాలజీ వైద్యుడు డాక్టర్ వరప్రసాద్, యూరాలజీ వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘనత సాధించిన ఎన్నారై వైద్య బృందాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు అభినందించారు. వైద్యులు మాట్లాడుతూ రోగికి కిడ్నీ మార్పిడి విధానం సరికొత్త జీవితాన్ని అందిస్తుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ శస్త్రచికిత్సలను పేదలకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 302 కిడ్నీ మార్పిడి చికిత్సలను పూర్తిచేశామని, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఘనత సాధించిన ఆస్పత్రిగా ఎన్నారై కీర్తి గడించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● ఏపీఎస్పీ కమాండెంట్ నగేష్‌కుమార్


ఏపీఎస్పీ పటాలంలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కమాండెంట్ నగేష్‌కుమార్

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలం కమాండెంట్ కే.నగేష్‌బాబు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నివాళి అర్పించారు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ నగేష్‌బాబు మాట్లాడుతూ దేశరక్షణలో కుటుంబం, ప్రాణం కంటే విధి నిర్వహణ గొప్పదని చాటిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్ డి.వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఫిరంగిపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం పోలీసుస్టేషన్ ఆవరణలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం చిత్రపటానికి సీఐ రవీంద్రబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైటర్ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నెకల్లు రోడ్డును నిర్మించాలి

● ఆటో డ్రైవర్ల డిమాండ్

తాడికొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాడికొండ అడ్డరోడ్డు నుంచి పొన్నెకల్లు వెళ్లే రోడ్డు ప్రయాణానికి వీల్లేకుండా ఉందని, ప్రభుత్వం వెంటనే రోడ్డును నిర్మించాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. సోమవారం అడ్డరోడ్డు సెంటర్‌లోని పొన్నెకల్లు ఆటోడ్రైవర్లు రోడ్డును నిర్మించాలని ఆందోళన చేయటంతో పాటు, సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకొని రోడ్డును నిర్మించాలని కోరారు. ఆటో వర్కర్లు చేస్తున్న ఆందోళనకు సీపీఎం, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

మా కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయి

గుంటూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గత నెల 24న ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గూండాలపాడులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన తమ కుమారుడు నేలపాటి మణికంఠ (19) మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు నేలపాటు మేరీ, దాసు దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఇంతవరకు పోస్టుమార్టం రిపోర్టు కానీ కేసు కాలు డీటెయిల్స్ కానీ రాలేదని వారు పేర్కొన్నారు.

పోలేరమ్మ అమ్మవారికి గ్రామోత్సవం

తుళ్లూరు, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో పోలేరమ్మ అమ్మవారికి గ్రామోత్సవం సోమవారం నిర్వహించారు. కనక తప్పెట్లు, కాళీ మాత వేషాధారకులు చేసిన నృత్యం అమ్మవారి గ్రామోత్సవంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. తుళ్లూరు ఐనచెరువు కాలనీలో పూర్వం ఉన్న పోలేరమ్మ అమ్మవారి గుడి శిథిలం కావటంతో భక్త కమిటీ నూతనంగా నిర్మించింది. ఈ నెల 25న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం జరగనుంది. బ్రహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

మధ్యాహ్నం భోజనం ప్లేట్ల పంపిణీ

తాడికొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సహాయ సహకాలు అందించి వారి ఉన్నతికి పాటుపడాలని ప్రముఖ వ్యాపారవేత్త శంకర్ పేర్కొన్నారు. సోమవారం శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గుంటూరులోని శ్రీవిద్యా ఉమెన్స్ ఫ్యాషన్ వేర్ యజమానులు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు.


ముగిసిన నందిగం సురేశ్ పోలీసు కస్టడీ


పటిష్ఠ బందోబస్తు మధ్య కోర్టుకు హాజరైన నందిగం సురేశ్

మంగళగిరి సిటీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీసు కస్టడీ సోమవారంతో ముగిసింది. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో మహిళ హత్య కేసుకు సంబంధించి రిమాండ్ ఖైదీగా ఉన్న సురేశ్‌ను రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ మంగళగిరి కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు అనుమతితో తుళ్లూరు పోలీసులు నందిగం సురేశ్‌ను రెండు రోజులపాటు విచారించారు. సోమవారం కస్టడీ సమయం ముగియడంతో మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. మరో రెండు వారాలపాటు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో నందిగం సురేశ్ కోర్టుకు హాజరైనప్పుడు ఆయన తన అనుచరులు, వైసీపీ కార్యకర్తలతో సెల్ఫీలు దిగుతూ ఫోటోలకు ఫోజులిచ్చారు. దీంతో పోలీసులు ముందస్తుగా అప్రమత్తమై పటిష్ఠ బందోబస్తు నడుమ సోమవారం కోర్టులో హాజరుపర్చారు.

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద ఉధృతి

● దిగువకు 2లక్షల 20 వేల 500 క్యూసెక్కులు


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి భారీగా పెరుగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 2లక్షల 28 వేల 532 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 70 గేట్లను 5 అడుగులు మేర ఎత్తి దిగువకు 2లక్షల 20 వేల 500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 5 వేల 513 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 2వేల 519 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు. దిగువ నదీతీర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 2519 క్యూసెక్కులు

దుగ్గిరాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 2519 క్యూసెక్కుల సాగునీటిని సోమవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 2,20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 338 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 70 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 870 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25, 26 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ పిలుపునిచ్చారు. మహాసభల తాలూకా కరపత్రాలను మంగళగిరి సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అభిషేక్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ మహాసభలో నాసర్‌జీ మాట్లాడుతూ 88 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తునే ఉందన్నారు. విద్యార్థులు తమ హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా మత్తే అభిషేక్, ఆళ్లమూడి హనోక్‌బాబులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు, ఏఐఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

సీఎస్ డీటీగా శివశంకర్

ప్రత్తిపాడు, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పౌరసరఫరాల శాఖ డీటీగా ఏ శివశంకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు అర్బన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ పద్మజ జిల్లా పౌరసరఫరాల కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

వాగు వంతెన వద్ద గేట్ల ఏర్పాటుపై రైతుల అభ్యంతరం


కొండవీటి వాగు వంతెన వద్ద అమర్చేందుకు తెచ్చిన ఫోల్డింగ్ గేట్లు

తాడేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరావతి కరకట్ట మీద వీవీఐపీలు, ఉన్నతాధికారులు తిరిగే మార్గం కావడంతో ఆ కరకట్టకు వెళ్లే ఉండవల్లి కొండవీటి వాగు వంతెన మార్గం వద్ద భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యల నిమిత్తం భారీ ఎలక్ట్రానిక్ బారికేడ్లు (ఫోల్డింగ్ స్టీల్ గేట్లు) ఏర్పాటు చేయనున్నారు. అలా ఏర్పాటు చేస్తే నిత్యం పొలాలకు వెళ్లే స్థానిక రైతులు ఇబ్బందులు పడతారని రాజధాని రైతుసంఘం నాయ కులు కొర్రపోలు ఈశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వాగు అవతల అనేక మంది రైతులకు పొలాలున్నాయని ఇలా సెక్యూరిటీ పేరిట ఏర్పాట్లు చేస్తే రైతుల పరిస్థితి ఏమిటని అధికారులు తక్షణమే స్పందించి గేట్ల ఏర్పాటు నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు. కాగా పలువురు ప్రజలు లోకేశ్ ఏర్పాటు చేస్తున్న ప్రజావేదిక వద్దకు కూడా ఈ మార్గానే వెళుతుంటారని వారికి కూడా ఇబ్బందేనని ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక రైతులు ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, అంజిరెడ్డి, శివయ్య తదితరులు కోరారు. పలువురు రైతులు మంత్రి లోకేశ్‌ను కలిసి ఇబ్బంది విన్నవిం చేందుకు సమాయత్తమవుతున్నారు. కాగా స్థానిక భద్రతా సిబ్బంది మాట్లాడుతూ ఈ భారీ గేట్ల వల్ల రైతులకు ఎలాంటి సమస్యలు ఉండవని అత్యవసర సమయాల్లో మాత్రమే వీటిని మూసే విధంగా తెరిచే విధంగా ఏర్పాటు చేస్తున్నా మని స్విచ్ ద్వారా ఆపరేట్ చేస్తామని ఇవి ఎలక్ట్రానిక్ బ్యారికేడ్లు (ఫోల్డింగ్ స్టీల్‌గేట్లు) అని చెప్పారు.

విద్యార్థినికి జేసీ ప్రశంసా పత్రం


జేసీ భార్గవతేజ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని శాశ్వత

కాకుమాను, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాకుమానుకు చెందిన శాశ్వత గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం ప్రశంసాపత్రంతో పాటూ రూ.5వేల నగదును జేసీ భార్గవతేజ నుంచి అందుకుంది. విజన్ స్వర్ణాంధ్ర 2024 సందర్భంగాలో భాగంగా సేవ్ ది గర్ల్ చైల్డ్ ఉపన్యాస పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకుగానూ ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు ఎంఈవో కేఏఫ్ కెన్నడీ తెలిపారు. విద్యార్థిని శాశ్వతను అభినందించిన వారిలో హెచ్ఎం సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

తిరుపతిరావు కుటుంబానికి పలువురు నేతల పరామర్శ

మేడికొండూరు అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాములపాటి తిరుపతిరావు కుటుంబ సభ్యులను పలువురు నాయకులు పరామర్శించారు. సోమవారం మేడికొండూరులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, డొక్కా మాణిక్య ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి తదితరులు హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు.

తహసీల్దార్ కార్యాలయానికి ఏడు అర్జీలు

తెనాలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండల తహసీల్దార్ కార్యాలయానికి ఏడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. అందులో 5 సివిల్ సమస్యలు కాగా 2 రేషన్ కార్డు కోసమని వెల్లడించారు. తమ కార్యాలయానికి వచ్చిన ప్రతి అర్జీని పూర్తి స్థాయిలో విచారించి త్వరితగతిన పరిష్కరించేలా కృషిచేస్తానని తహసీల్దార్ స్పష్టం చేశారు.

గ్రీవెన్స్‌కు ఐదు అర్జీలు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయి. డీఎల్‌పీవో 1, మున్సిపల్ 2, పోలీసు శాఖ 1, మండల పరిషత్ కార్యాలయంలో 1 దరఖాస్తు అందినట్లు కార్యాలయవర్గాలు తెలిపాయి.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు పొన్నూరు విద్యార్థులు

పొన్నూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు పొన్నూరు పట్టణంలోని సెయింట్ థామస్ కేరళ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పీడీ థామస్ సోమవారం తెలిపారు. ఇటీవల గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాఠశాలకు చెందిన పి మోహన రామసుభద్ర, ఏ శ్రీనివాసరాలు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో నంద్యాలలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనునట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రోజ్ థామస్, కోఆర్డినేటర్ అల్బిన్ జోసఫ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోవాలి

పొన్నూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని వైసీపీ సమన్వయ కర్త అంబటి మురళీకృష్ణ కోరారు. సోమవారం వైసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష నిర్వహించారు. వైసీపీ అభ్యర్థిగా పూనూరు గౌతమ్‌రెడ్డిని ఎంపిక చేసారన్నారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు తమ ఓటుహక్కు నమోదు చేసుకుని త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో పూనూరు గౌతమ్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పూనూరు గౌతమ్‌రెడ్డి, ఎంపీపీ పద్మలీల, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రూత్‌రాణి, ఆకుల వెంకటేశ్వరరావు, చేబ్రోలు ఎంపీపీ సాహితి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ మోసంపై ఎస్పీకి టీడీపీ కౌన్సిలర్ ఫిర్యాదు

గుంటూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని వీఎస్ఆర్ కళాశాల సమీపంలో విజయకృష్ణ బిల్డర్స్ యజమానిపై తెనాలి ఆరో వార్డు టీడీపీ కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి ఫిర్యాదు చేశారు. ప్రారంభించిన అపార్ట్ నిర్మాణం పూర్తి కాకుండానే విజయకృష్ణ బిల్డర్స్ యజమాని పలువురికి ప్లాట్లు విక్రయించాడు. దీనిలో భాగంగా తెనాలి ఆరో వార్డు టిడిపి కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి ఒక్కొక్క ఫ్లాట్ రూ.40 లక్షల చొప్పున 3ఫ్లాట్స్ కొనుగోలు చేశారు. అయితే బిల్డర్ అపార్టుమెంట్ గోడలు మాత్రమే నిర్మించి ఎటువంటి నిర్మాణం పూర్తి చేయకుండా మధ్యలోనే ఆపివేశాడు. అపార్ట్‌మెంట్ త్వరగా పూర్తి చేయాలని కోరుతుంటే పూర్తి చేయకపోగా తమ ఫ్లాట్లలో తాము నిర్మాణం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండగా లోనికి కూడా రానివ్వకుండా బిల్డర్ తమను బెదిరిస్తున్నాడని కౌన్సిలర్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి: డాక్టర్ కత్తి

పొన్నూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జీవిత చరిత్రను 6 తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు డిమాండ్ చేశారు. సోమవారం పాతపొన్నూరు లుంబినీవనంలో జరిగిన సమావేశంలో డాక్టర్ కత్తి పద్మారావు అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ డిసెంబరు 6న చినరావూరులో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నిర్వహించనునట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ విజయవాడలో, హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు హర్షనీయం అన్నారు. అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చటం ద్వారా విద్యార్థులకు వాస్తవ అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. అలాగే రెండు తెలుగు రాష్ట్రాలు అంబేద్కర్ అవార్డులను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్, మోహనరావు, కె రాజారత్నం, ఏ రవీంద్రబాబు, జై దయారత్నం, ఎం సంజీవరావు, బి కిరణ్, ఎం ప్రసాద్, జీ పీటర్ పాల్, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో సంగంజాగర్లమూడి గ్రంథాలయం

- 1916 సంవత్సరంలో గ్రంథాలయ భవన నిర్మాణం
- వర్షం కురిస్తే పైకప్పు నుంచి కారుతున్న నీరు
- ఇక్కట్లు పడుతున్న పాఠకులు
- ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా ఫలితం శూన్యం
- నూతన భవనం నిర్మించాలని పాఠకుల డిమాండ్



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం ఆరుబయట పేపర్ చదువుతున్న పాఠకుడు



గ్రంథాలయ భవనదాత అచ్యుత గురునాథగుప్త

తెనాలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల నుంచి ఏంతోమందికి విజ్ఞానాన్ని పంచిన సంగంజాగర్లమూడి శాఖ గ్రంథాలయం శిథిలావస్థకు చేరింది. ఒక్కప్పుడు ఈ గ్రంథాలయం పాఠకులతో కళకళలాడుతుండేది. 1916వ సంవత్సరంలో దివంగత అచ్యుత శ్రీరాములు కుమారుడు గురునాథం గుప్త ఈ గ్రంథాలయ భవనాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అందించారు. తెనాలి - గుంటూరు ప్రధాన రహదారిలోని సంగంజాగర్లమూడిలో అందరికీ ఉపయోగకరంగా గ్రంథాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈ గ్రంథాలయంలో చిన్నపిల్లల కథలు, వివిధ రకాల పుస్తకాలు, నవలలు, పోటీపరీక్షలకు అవసరమైన మెటీరియల్, న్యూస్ పేపర్లు, పలు రకాల పుస్తకాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ఇవే కాకుండా సమ్మర్ హాలీడేస్‌లో చిన్నారులకు విజ్ఞానాన్ని పెంపొందించేలా పలు రకాల శిక్షణా కార్యక్రమాలు కూడా చేపడుతుంటారు. ఒకప్పుడు పాఠకులతో నిండుగా ఉండే గ్రంథాలయం నేడు కళావిహీనంగా దర్శనమిస్తోంది. అందుకు ప్రధానంగా ప్రధాన రోడ్డుకు గ్రంథాలయం దాదాపుగా అడుగు పల్లంలో ఉండటం, పురాతన కాలం నాటి భవనం కావడంతో ఎండకు ఎండి, వానకు నాని పైకప్పు, గోడలు వంటివి కూడా పటుత్వాన్ని కోల్పోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే భవనం పైనుంచి వర్షపు నీరు, గోడలకు వినియోగించిన మట్టి వంటివి రాలి కింద పడుతున్నాయి. అంతేకాక పల్లంగా ఉండటంతో వర్షపునీటితో పాటు రోడ్డుపై పారే నీరు సైతం గ్రంథాలయంలోకి చేరుతున్నాయి. పాఠకులు వచ్చి పఠనం చేసే సమయంలో భవనం ఎక్కడ కుప్పకూలుతోందో నన్న భయంతో బిక్కుబిక్కుమంటూ వాటిని ప్రశాంతంగా చదవలేని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ దుస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపిందే లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పూర్వీకుల నుంచి తరతరాల వారు విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారని కాలక్రమేణా భవనం శిథిలావస్థకు చేరడంతో దాని సేవలు సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని పలువురు పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో కోట్ల రూపాయల విలువజేసే ఆ స్థలంలో భవనాన్ని కూల్చివేస్తే వెంటనే నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని లేకుంటే ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం కూడా లేకపోలేదని మరికొందరు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రంథాలయ భవనం రేపో మాపో కూలే రీతిలో ఉండటంతో దాని సేవలకు ఆటంకం లేకుండా గ్రామంలోని పాఠశాల భవనంలో గ్రంథాలయ సేవలు కొనసాగించేలా చూడాలని పలువురు విజ్ఞప్తిచేస్తున్నారు.

అదేవిధంగా నూతన భవనం నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తే గ్రామంలో పలువురు దాతలు కూడా వారివంతు సహాయ సహకారాలు అందించే అవకాశం ఉందని పలువురు తెలిపారు. పెద్ద ప్రమాదం జరగకముందే ప్రభుత్వం అధికార యంత్రాంగం స్పందించి గ్రంథాలయ సేవలను తరలించి నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు రావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. స్థానిక చెంచుపేటలోని ఐపీఎస్ ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పోలీసు అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ జనార్ధనరావు పాల్గొన్నారు. ముందుగా ఆయన ఐపీఎస్ ఉమేష్‌చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కపెట్టక అమరులైన పోలీసు అమర వీరులను మరువరాదని, వారు చేసిన త్యాగాలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ భార్గవి, పట్టణ సీఐలు రమేష్‌బాబు, మల్లికార్జునరావు, పలు స్టేషన్‌ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో..

తెనాలి క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం రైల్వేస్టేషన్ జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో విధి నిర్వహణలో అమర వీరులైన పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్ఐ జి.వెంకటాద్రి, స్టేషన్‌మాస్టర్ వెంకటరమణలు మాట్లాడుతూ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ముష్కర దాడుల్లో ఎందరో పోలీసు అధికారులు సిబ్బంది ప్రాణాలు వదిలారని, వారి ధైర్య సాహసాలు చిరస్మరణీయమన్నారు. గతంలో చిలకలూరిపేట పోలీస్‌స్టేషన్‌పై దాడిలో మృతిచెందిన అధికారులు ఆర్.ప్రసాద్, నిమ్మకాయల కోటేశ్వరరావు, బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో నక్సల్స్ అమర్చిన లాండ్‌మైన్‌లో అశువులు బాసిన తోట వెంకటేశ్వరరెడ్డి, సిబ్బందికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. రైల్వే పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఐపీఎస్ ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళి అర్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, ట్రైనీ డీఎస్పీ భార్గవి తదితరులు

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

- అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, తదితరులు

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు సూచించారు. సోమవారం పట్టణంలో 33, 34, 35, 37వ వార్డులలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదేశాల మేరకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పట్టణ ప్రజలు చెత్తను, వ్యర్థాలను మురుగు కాలువలలో వేయవద్దని, పారిశుధ్య కార్మికులకు ఇంటివద్దనే అందించాలని కోరారు. వ్యర్థాల వలన మురుగు కాలువ పారుదల నిలిచిపోయి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

కొల్లిపర, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సుజనసేవా సమితి అధ్యక్షుడు పి.గోపాలకృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నవరంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ విద్యార్థులకు యూనిఫాం అందజేసిన అనంతరం ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు టి. మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ స్కౌట్ ద్వారా సమాజసేవ, దేశభక్తి లభిస్తుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి సేవాభావాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రాజేశ్వరి, స్కౌట్ ఉపాధ్యాయుడు కిరణ్, గ్రామపెద్దలు ఎం.రవిబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి దుకాణాల లైసెన్స్ దరఖాస్తుకు గడువు పెంపు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీపావళి దుకాణాల లైసెన్స్ దరఖాస్తుల కోసం ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దీపావళి బాణసంచా విక్రయాలు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు లైసెన్స్ కోసం పలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అన్ని శాఖల అధికారులతో తహసీల్దార్ కార్యాలయంలో సింగిల్ విండో విధానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో దీపావళి బాణసంచా విక్రయాలకు అవసరమైన దుకాణాలను ఏర్పాటు చేసేందుకు టీజే కళాశాల, వీఎస్ఆర్ కళాశాల, ఐతానగర్ హైస్కూల్‌లను పరిశీలించి ప్రకటిస్తామన్నారు. తోపుడు బండ్లపై జనసంచారం ఉండే ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలకు అనుమతించబోమని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ శేషన్న, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజకు కుళ్ళిపోయిన కొబ్బరికాయలు

- ఆలయ ఈవో లీలా కుమార్‌కు ఫిర్యాదు

పెదకాకాని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివాలయంలో వివిధ రకాల పూజ ద్రవ్యాలతో పాటు ఇస్తున్న కొబ్బరికాయలు కుళ్లిపోయినవి వచ్చినట్లు భక్తులు ఆలయ ఈవో లీలాకుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పెద్ద ఎత్తున ఆలయంలో రాహు, కేతులకు భక్తులు పూజలు జరిపించారు. అయితే ఈ పూజలలో కుళ్ళిపోయిన కొబ్బరికాయలు రావటంతో మల్లన్న భక్తులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహు కేతు పూజలకు రూ.500 రూపాయలు పెట్టి టికెట్ కొంటున్నామని, అందులో కుళ్ళిపోయిన కొబ్బరికాయలు వస్తుండటంపై భక్తులు మండిపడ్డారు. దీనిపై ఈవో వివరణ ఇస్తూ కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేస్తామన్నారు.



పూజలకు ఇచ్చిన కుళ్లిన కొబ్బరి కాయలు

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

చేబ్రోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చేబ్రోలు ఎస్ఐ డి వెంకటకృష్ణ అన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సోమవారం డ్రగ్స్ అబ్యూజ్, ఈవ్ టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ వెంకట కృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన యువత ఆరోగ్యం దెబ్బతినటంతోపాటు జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా చట్టపరంగా శిక్షలు ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. తోటి విద్యార్థులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థినులు తమకు ఎదురవుతున్న సమస్యలను కళాశాల దృష్టికి తల్లిదండ్రుల దృష్టికి, పోలీసులకు తెలియజేయాలని అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాలలో ఇబ్బందులు ఎదురైనప్పుడు సైబర్ క్రైమ్ సెల్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు ఆకాంక్షలకు అనుగుణంగా యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. సమావేశంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లీగల్ అడ్వజర్ ఏ విజయలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి, యువజన సర్వీసుల శాఖ స్టెప్ మేనేజర్ బి.రాధిక, సూపరిండెంట్ పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఆలపాటి కృతజ్ఞతలు

తెనాలి అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా గుంటూరు శాసన మండలి నియోజకవర్గ స్థానానికి పోటీ చేసేందుకు అవకాశం కల్పించడంపై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రినికి కలిసి గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు తనను ఎంపిక చేసినందుకు గాను శాలువా, పుష్పగుచ్ఛాలతో ఆయనను సత్కరించారు. ఇప్పటికే నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల ఓట్లను ముమ్మరంగా చేర్పించేందుకు విస్తృతంగా పర్యటిస్తున్నామని సీఎంకు వివరించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ ఏఏఎస్‌రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అష్టావధానం కార్యక్రమంలో పాల్గొన్న పండితులు

అలరించిన అష్టావధానం

పొన్నూరు టౌన్, అక్టోబరు 21: తెలుగు బాష మాధుర్యం అద్వితీయం అని అవధాని నారాయణం ఆల సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం శంకరమఠంలో సోమవారం బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించారు. అద్దంకి పట్టణానికి చెందిన అవధాని నారాయణం బాలసుబ్రమణ్యం ఈ అవధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు భాషపై ప్రేక్షకులు, పండితులు సాహితీ అభిమానులు వేసిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అష్టావధాన ప్రక్రియ తెలుగుభాషకు మాత్రమే సొంతం అన్నారు. కార్యక్రమంలో సంచాలకులుగా ప్రముఖ కవి దివి శ్రీనివాసాచార్యులు వ్యవహరించారు. పండితులు పరాశరం శ్రీనివాశాచార్యులు, నారాయణం మురళీధర్, పొన్నూరు రమేష్‌బాబు, పరాశరం శేషబాబు, అగ్నిహోత్రం శ్రీనివాస మారుతి, చావలి వెంకటనరసింహమూర్తి, నాదెళ్ళ భార్గవ్, నారాయణం రాంబాబు, తాతాచార్యులు, పులిపాక ప్రసాద్, తదితర తెలుగు పండితులు ఈ అవధాన ప్రక్రియలో పాల్గొన్నారు.

విద్యార్థినికి కోడే ట్రస్ట్ సభ్యుల సాయం

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరవచ్చని టీడీపీ పార్టీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. చెంచుపేటలో సోమవారం పేద విద్యార్థినికి కోడే ట్రస్ట్ సభ్యులు ఉపకార వేతనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పార్టీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి పాల్గొని విద్యార్థినికి రూ.17వేలు చెక్కును ఉపకార వేతనంగా అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హరిబాబు, వేణుగోపాల్, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ హోమ్‌లో వ్యక్తిగత సంరక్షణ కిట్లు పంపిణీ

తెనాలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగలకుదురు జేఎంజే స్వధార్ హోంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 50మందికి తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నారపు వైష్ణవి పుట్టిన రోజును పురస్కరించుకుని టూత్‌పేస్టులు, బ్రస్‌లు,హెయిర్ ఆయిల్, షాంపూలు, సబ్బులు, ఇతర వ్యక్తిగత సంరక్షణ కిట్లు అందించారు. కార్యక్రమంలో జేఎంజే స్వధార్ హోం నిర్వాహకులు హృదయమేరిసిస్టర్, నారపురెడ్డి, తెనాలి సంక్షేమ అభివృద్ధిసంఘం సంస్థ సభ్యులు సునీల్, అచ్యుత్ సాంబశివరావు, రాజేంద్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం..

- పురపాలక సంఘ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అన్నారు. పట్టణ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కమిషనర్ శేషన్న అధికారులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి, ఇంజనీరింగ్ విభాగానికి రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై సత్వరమే అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది రూపాయల కాయిన్ల చెలామణిపై అవగాహన

పొన్నూరుటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పది రూపాయల కాయిన్లు చెల్లవు అనేది కేవలం అపోహ మాత్రమేనని బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మోహన్ కృష్ణ అన్నారు. సోమవారం జీబీసీ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద పది రూపాయల కాయిన్ల చెలామణిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వ్యాపార సంస్థల నిర్వాహకులను పిలిపించి పది రూపాయల కాయిన్లు స్వీకరించాలని సూచించారు. నగదు చెలామణిని తిరస్కరిస్తే నేరం అవుతుందని హెచ్చరించారు.

జిల్లాస్థాయి పోటీలలో వేజండ్ల విద్యార్థి ప్రతిభ



జేసీ భార్గవ్ తేజ నుంచి బహుమతి అందుకుంటున్న అఫ్రీన్

పొన్నూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలలో వేజండ్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని షేక్ అఫ్రీన్ ప్రథమ స్థానంలో నిలిచింది. స్వర్ణాంధ్ర ఎట్‌ది రేట్ ఆఫ్ 24లో భాగంగా ఆరోగ్య శాఖ నిర్వహించిన పోటీల్లో అఫ్రీన్ ప్రథమ స్థానంలో నిల్చింది. అఫ్రీన్‌కు సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్‌తేజ చేతుల మీదుగా రూ.5వేల నగదు, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. జిల్లా స్థాయిలో రాణిస్తున్న అఫ్రీన్‌ను డీఈవో పి శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి విజశ్రీ, ఉపాధ్యాయులు మేకల సుబ్బారావు, చంద్రశేఖర్, కె శ్రీనివాసరావు, జి వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

చిత్రలేఖనం పోటీల్లో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ్ గర్ల్‌చైల్డ్ అంశంపై జిల్లాస్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నారాకోడూరు హైస్కూల్‌కు చెందిన షేక్ నజ్మా జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, ఎం శివనాగలక్ష్మీ తులసి, తృతీయ స్థానం సాధించారు.